# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 18-9-2026   NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.   సంపుటి :33 సంచిక:41 పేజీలు:6 వెల: రూ.1/-


## నేటి కందం-నేటికి అందం

**తిరుమల తిరుపతి నందున**
**పరమోన్నత పరమపదము ప్రాప్తించినచోన్**
**తిరుమల దేవస్థానము**
**మరణించిన వారి కిడు ప్రమాదపు బీమా !!**

(తిరుపతి తిరుమల దేవస్థానంలో భక్తులకు బీమా సదుపాయాన్ని దేవస్థానం కలిగించింది. దీని వలన భక్తులకు ఎంతో ఊరట కలుగుతుందని ప్రజలు భావిస్తున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

## చురక

సమరోజ్వల తెలంగాణ
సాయుధ పోరాట కీర్తి
చెరిపేసినా ఏనాటికీ
చెదిరిపోదు దాని స్ఫూర్తి.
నిరంకుశ ప్రభుత్వాన్ని
నేలగూల్చినట్టి క్రాంతి
మతంరంగు మబ్బులతో
మసకబార్చలేరు కాంతి.



-వేల్పుల నారాయణ
9440433475

# ట్రంప్ తనయులకు సంబంధించిన కంపెనీతో పాక్ డీల్.. డ్రోన్స్ కొనుగోళ్లు



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17: యూఎస్‌కు చెందని డ్రోన్ తయారీ సంస్థ పవర్‌అజ్‌తో డ్రోన్ సరఫరా కోసం పాక్ ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సంస్థ సహ వ్యవస్థాపకుడు బ్రెట్ వెలికోవిచ్ తాజాగా అంతర్జాతీయ మీడియాతో ఈ విషయాన్ని పంచుకున్నారు. బుధవారం ఆయన పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో సమావేశమయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనయులు ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్‌లకు వాటాలున్న ఆరియస్ గ్రీన్‌వే హోల్డింగ్స్ అనే సంస్థలో పవర్‌అజ్ త్వరలో విలీనం కానున్న నేపథ్యంలో ఈ డీల్‌కు ప్రాధాన్యం ఏర్పడింది.

అయితే, ఎన్ని డ్రోన్స్‌ను సరఫరా చేస్తారు? డీల్ విలువ ఎంత? అనే వివరాలను మాత్రం వెలికోవిచ్ వెల్లడించలేదు. పాక్‌తో కలిసి సంయుక్తంగా ఓ జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయడం తమ దీర్ఘకాలిక లక్ష్యమని వెలికోవిచ్ తెలిపారు. పాక్‌లో ప్రైవేటు డిఫెన్స్ సంస్థలు ఇంకా శైశవ దశలో ఉన్నందుకు తమ లాంటి సంస్థల అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇక పాక్‌లో డిఫెన్స్ ఉత్పత్తుల తయారీకి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని కూడా వెలికోవిచ్ తెలిపారు.

ఈ డీల్ వెనుక ట్రంప్ కుటుంబం ఇన్‌ఫ్లుయెన్స్ ఉందన్న వాదనలను సంస్థ సీఈఓ ఫాక్స్ కొట్టిపారేశారు. కేవలం తమ ప్రతిభ, గుర్తింపు ఆధారంగా పాక్ నుంచి ఈ కాంట్రాక్ట్ దక్కించుకున్నామని చెప్పారు. తమ కంపెనీ రోజువారీ కార్యకలాపాలు, నిర్వహణలో ట్రంప్ తనయులు పాలుపంచుకోరని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, అమెరికన్ వెంచర్స్ అనే ఇన్వెస్ట్‌మెండ్ ఫండ్ ద్వారా ట్రంప్ సోదరులు ఆరియస్ సంస్థలో పెట్టుబడి పెట్టారు. ఆరియస్, పవర్‌అజ్ విలీనం తరువాత సంస్థలో ట్రంప్ సోదరుల వాటా 9.9 శాతంగా ఉంటుందని సమాచారం.

ఈ పరిణామాలపై డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ప్రతినిధి స్పందించారు. ట్రంప్ జూనియర్ కేవలం పెట్టుబడిదారుగా మాత్రమే ఉన్నారని అన్నారు. కంపెనీ నిర్వహణ, కాంట్రాక్టులు వంటి విషయాలతో ఆయనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ ఉదంతంపై ఎరిక్ ట్రంప్ ఇంకా స్పందించాల్సి ఉంది.

# ఏపీలో పిడుగులతో కూడిన వర్షాలు.. పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

అమరావతి, సెప్టెంబర్ 17: రాష్ట్రంలో పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సంబంధిత అధికారులను ఆదేశించింది. అంతేకాకుండా ప్రజలకు పలు సూచనలు జారీ చేసింది. రాష్ట్రంలో పిడుగుపాటు హెచ్చరికలు జారీ చేసింది. గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పలు జిల్లాలో ఉరుములతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు అల్లూరి, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లావాసులు అప్రమత్తంగా వ్యవహరించాలని విపత్తుల నిర్వహణ ససూచించింది.

అంతేకాకుండా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, గుంటూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని సంస్థ వెల్లడించింది. ఈ మేరకు జిల్లావాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా సిబ్బందిని సంస్థ ఆదేశించింది.

## తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కసరత్తు షురూ

హైదరాబాద్, సెప్టెంబర్ 17: తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కసరత్తు మొదలైంది. 2027 మార్చిలో రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానంతోపాటు, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రక్రియ ప్రారంభమైంది. సెప్టెంబర్ 28 నుంచి ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలుకానుంది.

నవంబర్ 6 వరకు ఈ దరఖాస్తులను స్వీకరించనున్నారు. నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. అనంతరం డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఇప్పటికే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన పాత ఓటర్లు కూడా ఈసారి కొత్తగా ఫారం-18 దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. అర్హత కలిగిన పట్టభద్రులు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

# స్కూల్‌లో ఫుడ్ పాయిజన్ కలకలం.. 15 మంది విద్యార్థులకు అస్వస్థత

సంగారెడ్డి, సెప్టెంబర్ 17:(నేటినిజం ప్రతినిధి):జిల్లాలో 15 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మునిపల్లి మండలం పెద్దలోడి జెడ్పీహెచ్ఎస్(జిఖఉబూ)లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈరోజు(గురువారం)మధ్యాహ్నం వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు విద్యార్థుల కోసం బిర్యానీ తెచ్చారు. అంతా కలిసి సరదాగా మాట్లాడుకుంటూ భోజనం చేశారు. విద్యార్థులతో పాటు వైస్ ప్రిన్సిపాల్ కూడా బిర్యానీ తిన్నారు. కాసేపటికే విద్యార్థులు, వెంకటేశ్వర్లు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం సదాశివపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అయితే వెంకటేశ్వర్లు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో ఆయనను మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్కూల్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. తమ పిల్లల పరిస్థితి చూసి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సదాశివపేట ప్రభుత్వాస్పత్రిలో విద్యార్థులకు చికిత్స కొనసాగుతోంది.

# ప్రధాని మోదీ నిర్ణయాలతో మరింత అభివృద్ధి చెందనున్న భారత్: సీఎం చంద్రబాబు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17: భారతదేశాన్ని అభివృద్ధి దిశగా ప్రధాని నరేంద్ర మోదీ తీసుకెళ్తున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రధాని నిర్ణయాలతో 25 ఏళ్లలో భారత్ మరింత అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం వారణాసిలో నిర్వహించిన వారణాసి - వాద్ నగర్ సంకల్ప్ యాత్రలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీని చూసి దేశం గర్వపడుతోందని అన్నారు.

లప్రధాని మోదీ జన్మదినాన్ని సెలబ్రేట్ చేసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఆయనకు వారణాసి కర్మ భూమి అని అభివర్ణించారు. మోదీని వారణాసి ప్రజలు వరుసగా మూడుసార్లు పార్లమెంట్‌కు పంపారని గుర్తు చేశారు. ఆయన పాలనలో దేశంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని వివరించారు. జాతి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా దేశ ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

లప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం నేడు. ఈ సందర్భంగా గురువారం వారణాసి - వాద్ నగర్ సేవా సంకల్ప్ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో సీఎం చంద్రబాబుతోపాటు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, పంకజ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సీఎం చంద్రబాబుపాటు వీరంతా వారణాసిలోకి శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో వీరంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడారు.

# ఎన్నికల అఫిడవిట్‌తో అడ్డంగా దొరికిన ముఠా!: మంత్రి పొంగులేటి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17: తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నికల అఫిడవిట్లు మరోసారి తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమర్పించిన అధికారిక ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఆయన ఆస్తుల వృద్ధిపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్లో తనకు ఒక్క ఎకరం భూమీ లేదని కేసీఆర్ పేర్కొ?న్నారు. కానీ తెలంగాణ ఉద్యమ కాలంలో.. ఆ తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబానికి చెందిన భూములు, ఆస్తులు ఊహించని రీతిలో పెరిగాయని రికార్డుల ద్వారా తెలుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

'తనకు ఒక్క ఎకరం కూడా భూమిలేదని 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపిన కేసీఆర్‌కు, ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయి తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తరువాత అధికారంలో ఉన్న పదేళ్లలో కేసీఆర్‌కు భూములు భారీగా పెరిగిన విషయం.. స్వయంగా ఆయన సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ల ద్వారా స్పష్టమవుతోంది. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఉద్యమకారులకు అప్పులే మిగిలాయి. కానీ కేసీఆర్ కుటుంబానికి లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఎలా వచ్చాయి. ప్రభుత్వ, పేదల, దళితుల అసైన్డ్ భూములను దోచుకోవడం ద్వారానే కదా.! ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీద లక్షల కోట్ల ఆస్తులను అక్రమంగా సంపాదించుకున్న కల్వకుంట్ల కుటుంబం.. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని బొంకుతున్న డ్రామారావు' అని పొంగులేటి 'ఎక్స్'లో రాసుకొచ్చారు. ఈ విషయమై ఎన్నికల అఫిడవిట్లో తప్పులు రాసి మోసం చేశారా.. లేక ప్రజలకు అబద్ధాలు చెప్తున్నారా. అని ట్యాగ్ చేస్తూ నిలదీశారు.

# రష్యా చమురు కొనవద్దని అమెరికా అల్టిమేటం.. తీవ్రంగా స్పందించిన భారత్..!

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17: రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న భారత్ చైనా వంటి దేశాలకు డొనాల్డ్ ట్రంప్ సర్కారు హెచ్చరికలు చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. రష్యా చమురును ఇతర దేశాలు కొనుగోలు చేయకుండా కొత్త ఆంక్షలతో కూడిన బిల్లును యూఎస్ కాంగ్రెస్‌ఆమోదించిన నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అమెరికన్ కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ మాట్లాడుతూ.. 'భారత్, చైనాలకు మా సందేశం ఒక్కటే. మీ పద్ధతి మార్చుకోండి. మీకు కావాల్సిన చమురు, గ్యాస్‌ను వేరే దేశాల నుంచి కొనండి. బుజ్జగింపులు సరైన వ్యూహం కాదు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కొత్త ఆంక్షల ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చర్చలవైపు నెట్టి, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. "పుతిన్, మా దగ్గర నీ నంబర్ ఉంది. ఉక్రెయిన్.. మీరు ఒంటరి కాదు" అని ఆయన అన్నారు.

'లిండ్సే ఓ గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' పేరుతో రూపొందించిన ఈ చట్టం, రష్యా అధికారులు, బ్యాంకులు, అలాగే రష్యా ఇంధనాన్ని ప్రపంచవ్యాప్తంగా రవాణా చేస్తున్న 'షాడో ఫ్లీట్' (రహస్య ట్యాంకర్ల వ్యవస్థ) పై కఠిన ఆంక్షలు విధిస్తుంది. ఈ చట్టం ప్రకారం.. రష్యా నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటున్న మొదటి ఐదు దేశాలపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెడుతుంది.

ఈ జాబితాలో భారత్, చైనాలు ప్రధానంగా ఉన్నాయి. అయితే రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ వాటిని తగ్గించడానికి గణనీయమైన చర్యలు తీసుకున్న దేశాలకు మినహాయింపు ఇచ్చారు.

ఈ బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో 262-159 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది. ప్రస్తుతం ఇది అధ్యక్షుడు ట్రంప్ సంతకం కోసం వేచి ఉంది. అమెరికా హెచ్చరికలపై భారత ప్రభుత్వం తీవ్రంగా, స్పష్టంగా స్పందించింది. తమ దేశ ప్రజల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నామని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగిస్తామని స్పష్టంచేసింది.

# భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ గారి జన్మదినం సందర్భంగా ములుగులో సేవా కార్యక్రమాలు

**ములుగు మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ ? ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**



ములుగు, సెప్టెంబంర్ 17:(నేటినిజం ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం గారి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా ములుగు జిల్లాలో నెల రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు ఈ సేవా కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

ఈ సందర్భంగా ములుగు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ పార్క్‌లో గల మున్సిపాలిటీ అతిథి గృహం లో మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి, వారికి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ రాజ్యసభ సభ్యులు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు శ్రీ గరికపాటి మోహన్ రావు గారు హాజరై, పారిశుద్ధ్య కార్మికులకు తన చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు. మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీరా సీతారాం నాయక్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ పట్టణ పరిశుభ్రత కోసం అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని, వారి సేవలను గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అని అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి 76వ జన్మదినం సందర్భంగా ఆయనకు ములుగు జిల్లా ప్రజల తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

అనంతరం ములుగు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి పండ్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా మాజీ అధ్యక్షులు చింతలపూడి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా కృష్ణవేణి, భూక్య జవహర్ లాల్,సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కన్వీనర్ నగరపు రమేశ్,జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవీంద్రాచారి,జిల్లా ఉపాధ్యక్షులు జినుకల కృష్ణాకర్ రావు, మేడిశెట్టి ఓమ్రా, భర్తాపురం నరేష్,కోశాధికారి గంగిశెట్టి రాజ్ కుమార్, చందా జ్యోతి, అంతి రెడ్డి రమాదేవి, రేవతి, నిర్మల, మోర్చా అధ్యక్షులు కొర్ర సుమలత, మాదరి శ్రీకాంత్, దండిగ వెంకన్న, మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు, బైకాని మహేందర్, మమన్, సంపత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ములుగు జిల్లాలో ప్రజాసేవ, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, సామాజిక సేవలకు సంబంధించిన మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా నాయకులు తెలిపారు.

# ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేపై కూలీలపైకి దూసుకెళ్లిన కారు.. ఇద్దరు మృతి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17: హరియాణాలోని గుర్గావ్ పట్టణానికి సమీపంలో ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన ఒక కారు ఢీకొనడంతో ఇద్దరు కార్మికులు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి 2.30 గంటల తర్వాత గుర్గావ్ ఫ్లై ఓవర్ కింద, న్యూపాలం విహార్ పరిధిలోని శ్రీరామ్ చౌక్ వద్ద జరిగింది.

ఘటన జరిగిన సమయంలో నలుగురు కూలీలు ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేపై ఉన్న ఫ్లై ఓవర్ కింద ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రిల్స్ ఏర్పాటు చేసే పనిలో ఉన్న కార్మికులపైకి అతివేగంగా వచ్చిన ఒక కారు దూసుకెళ్లింది. కారు వేగంగా వస్తుండటం చూసిన కార్మికులు ఆ గ్రిల్స్ సమీపం నుంచి పక్కకు దూకేందుకు ప్రయత్నించారు.

అయినప్పటికీ కారు వారిని ఢీకొంది. ఈ ఘటనలో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. నలుగురిలో ఇద్దరు కార్మికులు మరణించారు.

మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా కారు నడిపింది 20 ఏళ్ల వేదాన్ ఖన్నగా గుర్తించారు.


ప్రేమ   **ఆహ్వానం**   సేవ

**శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్**
**శ్రీ కృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం**
సంయుక్త ఆధ్వర్యంలో

ప్రముఖ రచయిత
**శ్రీ తిరుమల వెంకటస్వామి (టి.వి.స్వామి)**
రచించిన
**'మహాస్థపతి సిరిలూత'**
(చారిత్రక నాటకం)
**'అమెరికాలో నా అనుభవాలు'**
(యాత్రానుభవం)
**గ్రంథాల అవిష్కరణ - అంకితోత్సవ సభ**

తేది : 18-09-2026 శుక్రవారం సా॥ 05-30 గం॥లకు
వేదిక : శ్రీ కృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం, సుల్తాన్‌బజార్, కోఠి, హైదరాబాదు.

ముఖ్య అతిథులు & ఆవిష్కర్తలు :
పద్మశ్రీ పురస్కార గ్రహీత **ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు,**
విశ్రాంత ఉపకులపతి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం
"మహాస్థపతి సిరిలూత" గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు.
**శ్రీ మద్దాళి రఘురాం గారు,** కార్యదర్శి, కిన్నెర ఆర్ట్ థియేటర్స్
"అమెరికాలో నా అనుభవాలు" పుస్తకాన్ని ఆవిష్కరించి సమీక్షిస్తారు.

"మహాస్థపతి సిరిలూత" గ్రంథ అంకిత స్వీకర్త :
**డా॥ రేవూరి అనంత పద్మనాభరావు గారు,** విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ జనరల్, దూరదర్శన్, ఢిల్లీ
అమెరికాలో నా అనుభవాలు గ్రంథ అంకిత స్వీకర్త :
**శ్రీ బైస దేవదాస్ గారు,** 'నేటి నిజం' పత్రిక సంపాదకులు

సభాధ్యక్షులు : **ఆచార్య టి. గౌరీశంకర్ గారు,** పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం
పుస్తకసమీక్షకులు : **శ్రీ బండారుపల్లి రామచంద్రరావు గారు,**
మహాస్థిపతి సిరిలూత : ప్రముఖ విద్యావేత్త
ఆత్మీయ అతిథులు : **శ్రీ రవికుమార్ గారు & ప్రవీణ్‌కుమార్ గారు,**
"నమో నమో ప్రియ భారతమాత (పాటను స్వరపరిచి, గానం చేసినవారు)

**ఉడయవర్లు,** కార్యదర్శి, శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం
**లలితవాణి**, ఉపాధ్యక్షులు, మానస ఆర్ట్స్
**రఘుశ్రీ**, కార్యదర్శి, మానస ఆర్ట్స్

# సురక్షిత నీటి ప్రవాహంతో సమానత్వ సాధన

## (18 సెప్టెంబర్ "ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం" సందర్భంగా)

జీవులకు ప్రాణాధారం నీరు మాత్రమే. నీరు ఒక సార్వత్రిక ద్రావణి. జలం లేకుండా జీలడవనం సాగదు. ప్రకృతి ప్రసాదించిన సహజ అమూల్య వనరులుగా నీటి నిల్వలు కలిపిస్తాయి. నదులు, సరస్సులు, చెరువులు, వాగులు, సముద్రాలు, భూగర్భజలాలు లాంటి పలు నీటి వనరులు సకల ప్రాణికోటికి అందుబాటులో ఉన్నాయి. రసాయనశాస్త్ర పరంగా నీటిని త్రిపరమాణుక విజాతీయ అణువుగా నామకరణం చేశారు. రెండు హైడ్రోజన్ పరమాణువులు, ఒక ఆక్సీజన్ పరమాణువు కలిసి ఊ2ా అను రసాయన ఫార్ములాతో సూచించడం జరుగుతోంది. సురక్షిత మంచి నీరు అందించినపుడు మాత్రమే పలు వ్యాధులకు అడ్డుకట్టపడుతుంది. కలుషిత నీరు తాగితే కలరా, డయేరియా, టైఫాయిడ్, డిసెంట్రీ, హెపటైటిస్, మలేరియాసిస్ లాంటి తీవ్రమైన వ్యాధులు సోకుతాయి. మానవాళి ఎదుర్కొంటున్న 80 శాతం రోగాలకు కలుషిత తాగు నీరే కారణమని తెలుస్తున్నది. ప్రపంచ మరణాల్లో 5 శాతం వరకు కలుషిత నీటి వల్ల కలుగుతున్నట్లు నిర్ధారించారు. భారత్‌లో 70 మిలియన్ల మరణాలు డయేరియా కారణంగా నమోదు అవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, విశ్వవ్యాప్తంగా ప్రతి ముగ్గురు జనాభాలో ఒక్కరు సురక్షిత నీటికి దూరంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

### ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం:

భూమండల ఉపరితలంపై 71 శాతం నీరు ఆక్రమించి ఉంది. ప్రపంచంలోనే నీటిలో 3 శాతం మాత్రమే సురక్షిత మంచి నీరుగా అందుబాటులో ఉన్నది. మిగిలిన 97 శాతం నీరు సముద్రాలు, మంచు కొండల రూపంలోనే ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం ప్రజలకు స్వచ్ఛమైన సురక్షిత నీరు అందడం లేదు. పరిసరాల పరిశుభ్రతకు కూడా నీటి అవసరం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా తాగు, సాదు నీటి కొరతలను తట్టుకోవడానికి, అందుబాటులో ఉన్న నీటిని కలుషితం కాకుండా చూసుకోవడానికి, తరుచుగా నీటి నాణ్యతలను తెలుసుకోవడానికి సంబంధించిన అవగాహన కల్పించడానికి 2003 నుంచి అమెరికాకు చెందిన మంచి నీటి సంస్థ చొరవతో ప్రతి ఏట 18 సెప్టెంబర్ రోజున "ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం (వరల్డ్ వాటర్ మానిటరింగ్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. 2026

### ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం ఇతివృత్తంగా "నీరు - సమానత్వం :

నీరు ప్రవహించిన చోట సమానత్వం వృద్ధి చెందుతుంది" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది.

మనకు స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను తరుచుగా పరీక్షించుకోవడం, నీటి నాణ్యత పట్ల అవగాహన కలిగి ఉండడం, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం తప్పనిసరి అవుతున్నది. నీటి నాణ్యతను విచ్ఛిన్నం చేయడానికి పురుగు మందులు, రసాయన ఎరువులు, మురుగు నీరు, రసాయన వ్యర్థాలు, పరిశ్రమల వ్యర్థాలు, మానవ ప్రమేయం వ్యర్థాలతో నీరు కలుషితం కావడం, చమురు లీక్ కావడం లాంటివి దోహదపడుతున్నాయి. వీటికి తోడుగా ఉష్ణోగ్రత, ఆమ్లత్వం, కరిగి ఉన్న ఆక్సీజన్, క్లారిటీ లాంటివి కూడా పనిచేస్తాయి. నీటిని శుద్ధి చేయడానికి వడపోత, స్వేదనం, మరిగించడం, క్లోరినేషన్ లాంటివి దోహదపడతాయి.

### సురక్షిత తాగు, సాగు నీటి కోసం యుద్ధాలు వద్దు:

నేడు అభివృద్ధి చెందుతున్న అల్పాదాయ ప్రపంచదేశాల్లో ఇథియోపియా, ఉగాండా, సోమాలియా, నైజీరియా, పాకిస్థాన్, మొజాంబిక్ లాంటి దేశాల్లో అధిక జనాభాకు సురక్షిత తాగు నీరు అందడం లేదు. నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తరుచుగా నీటి నాణ్యతను పరీక్షించుకోవడం, సురక్షిత తాగు నీటి అవసరాలను అవగాహన పరచడం, సభలు/ సమావేశాలు నిర్వహించి నీటి పర్యవేక్షణ ప్రాధాన్యాన్ని వివరించడంతో లాంటి కార్యక్రమాలను తేపట్టాలి. నీటి రవాణాలో లీకేజీలను అడ్డుకోవడం, నల్లా నీరు వృధా కాకుండా చూసుకోవడం, సూక్ష్మ సేద్యం చేయడం, స్ప్రింక్లర్లను వాడడం, నీటి పొదుపు పట్ల విద్యార్థులకు అవగాహన కలిపించడం లాంటివి వివరించాలి. గ్రామీణ భారతంలో 83 శాతం, పట్టణ జనాభాలో 91 శాతం జనాభాకు సురక్షిత నీరు లభిస్తున్నట్లు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జలంతో జనానికి విడదీయరాని బంధం ఉన్నది. పేదరికం, అధిక జనాభా, నిరక్షరాస్యత వంటి కారణాలు కూడా సురక్షిత నీటి లభ్యతకు ప్రతిబంధకాలుగా పని చేస్తున్నాయి.

విద్య, వైద్యం, సురక్షిత తాగు నీరు లభించడం ఒక ప్రాథమిక హక్కు అని తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద అధికంగా ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా 3 బిలియన్ల ప్రజలు అంతర్జాతీయ నీటి వనరులపైన మాత్రమే ఆధారపడుతున్నట్లు, అందులో కేవలం 24 దేశాలు మాత్రమే ఒక అంతర్జాతీయ ఒప్పందాలను చేసుకున్నాయని తెలుస్తున్నది. తాగు, సాగు నీటి లభ్యతపై ప్రపంచ శాంతి ఆధారపడి ఉన్నది. నీటి కోసం వివిధ పౌర సమూహాలు, దేశాలు ఘర్షణ పడుతున్నాయి.

సహజ నీటి వనరులను సక్రమంగా వాడుకోని యెడల కలుషిత జలాలు ఏరులైపారి రోగాలను వ్యాపింపజేస్తాయి. నేటి పౌర సమాజం నీటిని పొదుపుగా వాడుకుంటూ, కలుషితం కాకుండా చూసుకుంటూ, నీటి వనరులను పర్యవేక్షించుకుంటూ ఆయురారోగ్యాలతో మనుగడ సాగిద్దాం, నీటి ఆధార అనారోగ్యాలకు అడ్డుకట్ట వేద్దాం.



-మధుపాళీ
9949700037

# శాంతిని, ప్రగతిని, సమృద్ధిని భారత్ కోరుకుంటూ అంతర్జాతీయ వేదికపై వాణిని బిగ్గరగా వినిపిస్తోంది: ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17:జాతీయ ప్రాధాన్యం కలిగిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్డ్ అఫైర్స్ (ఐసీడబ్ల్యూఏ) 25వ వార్షికోత్సవాలను ఈ రోజు న్యూఢిల్లీ లోని సప్రూ హౌస్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉపరాష్ట్రపతి, ఐసీడబ్ల్యూఏ అధ్యక్షుడు శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ప్రసంగింశాంతిని, ప్రగతిని, సమృద్ధిని భారత్ కోరుకుంటూ అంతర్జాతీయ వేదికపై వాణిని బిగ్గరగా వినిపిస్తోంది: ఉపరాష్ట్రపతిచారు. రజతోత్సవం అంటే కృతజ్ఞత చాటుకుంటూ, ఇప్పటి వరకు సాగించిన ప్రస్థానాన్ని సమీక్షించుకునే సందర్భమని ఆయన అన్నారు. కౌన్సిల్ విశిష్ట వారసత్వానికి తోడ్పడిన వ్యవస్థాపకులు, పూర్వ నేతలు, డైరెక్టర్ జనరళ్లు, పండితులు, దౌత్యవేత్తలు, పరిశోధకులతో పాటు సిబ్బందిని ఆయన ప్రశంసించారు.

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి, ఐసీడబ్ల్యూఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. జైశంకర్, విదేశీ వ్యవహారాల కార్యదర్శి శ్రీ విక్రమ్ మిశ్రీతో పాటు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన పూర్తి బృందానికి ఉపరాష్ట్రపతి అభినందనలు తెలిపారు. సంఘర్షణలు, వైరుధ్యాలతో సతమతం అవుతున్న ప్రపంచంలో, న్యూఢిల్లీ నేతల ప్రకటన ఏకగ్రీవంగా ఆమోదం పొందడం చెప్పుకోదగిన విజయమని ఆయన అన్నారు.

దేశాల మధ్య సత్సంబంధాలను నెలకొల్పడమే దౌత్యం ప్రథమ లక్ష్యమని శ్రీ సి.పి. రాధాకృష్ణన్ స్పష్టం చేశారు. మానవ ప్రగతి, ప్రపంచ శాంతి చెట్టపట్టాల్ వేసుకొని ముందుకు సాగాలని, ఇదంతా దేశాలు ఇతర దేశాల బాధలను అర్థం చేసుకొని, పరస్పర హితం కోసం పనిచేసినప్పుడు మాత్రమే సాధ్యపడుతుందని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సారథ్యంలో భారత్ అంతర్జాతీయ పాత్రకు ప్రాధాన్యం పెరుగుతోందని ఉపరాష్ట్రపతి అన్నారు. శాంతి, ప్రగతి, సమృద్ధిల సాధనలో భారత్ బలమైన వాణిని వినిపించే దేశంగా ఎదిగిందన్నారు. ప్రపంచమంతా ఒకే కుటుంబం అని అర్థం వచ్చే 'వసుధైవ కుటుంబకమ్' గురించి శ్రీ రాధాకృష్ణన్ ప్రస్తావిస్తూ, కోవిడ్ సంక్షోభ సమయంలో 'వ్యాక్సీన్ మైత్రి', విపత్తుల వేళల్లో భారత్ ప్రతిస్పందించి చేపట్టిన చర్యలు, 'మిషన్ లైఫ్' (ఒతిఈఇ), అంతర్జాతీయ సౌర కూటమి, గ్లోబల్ బయోఫ్యూయల్ అలయన్స్ వంటి అంతర్జాతీయ కార్యక్ర మాలు ఈ సిద్ధాంతాన్ని చేతలలో చూపిన ఉదాహరణలని వివరించారు.

యూపీఐ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరంగా భారత్ సాధించిన విజయాలను గురించి ఉపరాష్ట్రపతి ప్రస్తావించి, "పారదర్శక చెల్లింపు పద్ధతులు పారదర్శక పరిపాలన వైపు తీసుకువెళ్తాయి'' అన్నారు. అభివృద్ధి కోసం తపిస్తున్న దేశాలతో భారత్ తన సాంకేతిక, సంస్థాగత శక్తియుక్తులను పంచుకుంటోందని, దీనికోసం ఐటీఈసీ, విద్యా రంగ సహకారం వంటి వాటిని వినియోగిస్తోందని ఆయన అన్నారు. జాంజిబార్‌లో మొదటి ఐఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేసిన సంగతిని గుర్తుచేశారు. "అభివృద్ధి కోసం తపిస్తున్న దేశాలకు ప్రపంచ వేదికపై భారత్ నాయకత్వం వహిస్తోంది'' అని ఆయన అన్నారు. భారత్ పట్ల అంతర్జాతీయ భాగస్వామ్య దేశాల్లో నమ్మకం, భరోసా అంతకంతకూ పెరుగుతున్నాయని ఉపరాష్ట్రపతి అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా స్థితిగతులు మారిపోతున్న నేపథ్యంలో ఐసీడబ్ల్యూఏ పాత్ర మరింత ప్రధానమైందిగా మారిందని శ్రీ రాధాకృష్ణన్ అన్నారు. కౌన్సిల్‌కు నాలుగు ప్రాధాన్యాలు ఉన్నాయని ఆయన వివరించారు. భారత్ అనుసరిస్తున్న పొరుగుదేశాలకు ప్రాధాన్యం, యాక్ట్ ఈస్ట్, గ్లోబల్ సౌత్, ఇండో-పసిఫిక్ అంశాలపై పరిశోధనను పటిష్టపరచడం, సైబర్ భద్రత, అంతరిక్షం, క్రిటికల్ టెక్నాలజీలు, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ సంబంధిత పనులను విస్తరించడం, విశ్వవిద్యాలయాలు, యువ పరిశోధక విద్యార్థులతో అనుబంధాన్ని పెంపొందింప చేసుకోవడం, ప్రామాణిక భారతీయ దృక్పథంతో ప్రపంచ వ్యవహారాలకు సంబంధించిన ఓ విశ్వసనీయ జ్ఞాన భాండాగారంగా మారడం.. ఈ నాలుగూ ఐసీడబ్ల్యూఏ ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సిన అంశాలని ఆయన అన్నారు.

2047కల్లా 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు తోడ్పడటానికి ఐసీడబ్ల్యూఏ మేధావరంగా, సంస్థాగతంగా తనను తాను సన్నద్ధపరుచుకోవాలని, అంతర్జాతీయ వ్యవహారాల అధ్యయనానికి ప్రపంచంలో గౌరవనీయ కేంద్రాల్లో ఒకటిగా నిలిచేందుకు పనిచేయాలని ఉపరాష్ట్రపతి సూచించారు. ఐసీడబ్ల్యూఏ స్వర్ణోత్సవ వేళకల్లా భారత్‌కే కాకుండా శాంతియుత ప్రపంచానికి మరింత ఎక్కువ తోడ్పాటును అందించగలుగుతుందని తాను విశ్వసిస్తున్నానని ఆయన అన్నారు.

ఐసీడబ్ల్యూఏ ప్రస్థానాన్ని, పరిణామ క్రమాన్ని వివరిస్తూ ఏర్పాటు చేసిన ఓ ఛాయాచిత్ర ప్రదర్శనను ఉపరాష్ట్రపతి చూశారు. కౌన్సిల్‌కు గతంలో డైరెక్టర్ జనరల్‌గా ఉంటూ సేవలను అందించిన వారికి మెమెంటోలను ఆయన ప్రదానం చేశారు.

# ఆర్ఎస్ఎస్ శతాబ్ద కాలపు సేవాభావం భారతీయ సేవా సంప్రదాయానికి ప్రతిబింబం: ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: నేడు న్యూఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో తెలంగాణ మాజీ గవర్నర్, పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ రచించిన "ఎ సెంచరీ ఆఫ్ సర్వీస్ -ది ఆర్ఎస్ఎస్ ఇన్ 100 యాక్ట్స్ ఆఫ్ సేవా" పుస్తకాన్ని ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ఆవిష్కరించారు.

లఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ.. ఆర్ఎస్ఎస్ శతాబ్ద కాలంగా అందిస్తున్న సేవలు, సామాజిక బాధ్యత, దేశ నిర్మాణంలో దాని కృషిని ఈ పుస్తకం నమోదు చేసిందని తెలిపారు.

"నేటి వార్త రేపటి చరిత్ర" అని పేర్కొన్న శ్రీ సీపీ రాధాకృష్ణన్.. మంచి పనులను నమోదు చేయడం ఎంతో ముఖ్యమని, లేకపోతే అవి ప్రజల జ్ఞాపకం నుంచి కనుమరుగయ్యే అవకాశం ఉందని అన్నారు. సేవాభావం నిరంతర సామాజిక సేవగా ఎలా రూపాంతరం చెందిందో ఈ పుస్తకం వివరిస్తుందని ఆయన పేర్కొన్నారు.

"సేవే ధర్మం; అది ఒక కర్తవ్యం" అనే భావనను ప్రాథమిక ఆదర్శంగా ఉపరాష్ట్రపతి అభివర్ణించారు. పేదలు, అణగారిన వర్గాలు, సమాజంలోని వివిధ వర్గాలు, కార్మికులు, మహిళలు, పిల్లలకు ఆర్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు చేరాయని తెలిపారు. కోవిడ్ 19 మహమ్మారి సమయంలో ఆహారం, మందులు, ఇతర అత్యవసర సహాయాన్ని అందించడంలో ఆర్ఎస్ఎస్ స్వచ్ఛంద కార్యకర్తలు పోషించిన పాత్రను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

పుస్తకంలోని ''వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణం" అనే అంశాన్ని ప్రస్తావిస్తూ.. దేశ నిర్మాణానికి దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, జాతీయ ఐక్యత ఎంతో అవసరమని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ద కాలపు సేవలకు సంబంధించిన రికారుగా మాత్రమే కాకుండా, దేశ సేవా సంప్రదాయం, సంస్కృతి, జాతీయ చైతన్యాన్ని భవిష్యత్తు తరాలకు ప్రతిబింబించే పత్రంగా కూడా ఈ పుస్తకం నిలుస్తుందని ఆయన అన్నారు. డాక్టర్ తమిళిసై సౌంద రరాజన్‌తో పాటు పుస్తక ప్రచురణకు సంబంధించిన ప్రతి ఒక్కరినీ ఉపరాష్ట్రపతి అభినందించారు. చరిత్రను నమోదు చేసే ఇలాంటి మరిన్ని ప్రయత్నాలు భవిష్యత్తులో కొనసాగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి..

## -కడెం మండల అధ్యక్షుడు రెంకల శ్రీనివాస్ యాదవ్



ఆదిలాబాద్, సెప్టెంబర్ 17:యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని కడెం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెంకల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు సమరసింహారెడ్డి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఇన్‌చార్జి రోషిణి జైస్వాల్, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి నిహార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో యూత్ కాంగ్రెస్ నాయకులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు తరి గంగాధర్, మోరపాక రాజు, సాకు శివ, అంబారిపేట్ గ్రామ అధ్యక్షుడు వేల్పుల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# శరత్‌చంద్ర ఛటోపాధ్యాయ 150వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన ప్రధాని

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17:ప్రఖ్యాత బెంగాలీ రచయిత శరత్ చంద్ర ఛటోపాధ్యాయ 150వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. భారతీయ భాషలన్నింటితో పాటు అనేక విదేశీ భాషల్లోకి అనువాదమైన ఆయన రచనలకున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ... ఈ దిగ్గజ రచయితను స్మరించుకున్నారు. 19వ శతాబ్దంలో భారతదేశాన్ని ముఖ్యంగా గ్రామీణ బెంగాలీ సమాజాన్ని కచ్చితమైన, సున్నితమైన రీతిలో శరత్‌చంద్ర ఛటోపాధ్యాయ రచనలు ప్రతిబింబిస్తాయన్నారు. భారతీయ భాషలన్నింటితో పాటు అనేక విదేశీ భాషల్లోకి ఆయన రచనలు అనువాదమయ్యాయి. అవి 19వ శతాబ్దంలో భారతదేశాన్ని, ముఖ్యంగా గ్రామీణ బెంగాలీ సమాజాన్ని వాస్తవికంగా చిత్రించిన ఆయన రచనలు చిరస్మరణీయంగా నిలిచిపోయాయి. సామాజిక సంస్కరణలు, మహిళా హక్కులు, జాతీయవాదం పట్ల ఆయనకున్న నిబద్ధత కూడా అంతే విశేషమైనది.

# వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ స్టేషన్ ఎండబ్ల్యూఓ సెమినార్-2026



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17:వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ హెడ్‌క్వార్టర్స్‌లో స్టేషన్ మాస్టర్ వారెంట్ ఆఫీసర్ల (ఎండబ్ల్యూఓల) కోసం సదస్సును నిర్వహించారు. డబ్ల్యూఏసీ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ ఎయిర్ మార్షల్ జార్జ్ థామస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు... కమాండ్ పరిధిలోని వివిధ స్టేషన్ల నుంచి ఎండబ్ల్యూఓలు హాజరయ్యారు.

ఉత్తమ విధానాలను, ఆలోచనలను పంచుకునేందుకు, మెరుగుపరచాల్సిన అంశాలపై చర్చించేందుకు ఇది ఉమ్మడి వేదికగా నిలిచింది. పనిచేసే వాతావరణాన్ని మెరుగుపరచటం, సాధారణ సవాళ్లను పరిష్కరించటం, ఎయిర్ వారియర్లు, వారి కుటుంబాల సంక్షేమ కార్యక్రమాలను మరింత బలపరచటంపై ఈ చర్చలు దృష్టి సారించాయి.

వాయుసేన కేంద్రాల్లో సానుకూల, అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయటంలో స్టేషన్ ఎండబ్ల్యూఓలు కీలకమని ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ స్పష్టం చేశారు. సమర్థవంతమైన సమాచార మార్పిడిని, దృఢమైన వృత్తి నైపుణ్యాన్ని, సంక్షేమ దృక్పథాన్ని పెంపొందించటంలో వారు కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. సిబ్బంది సంక్షేమం, నిరంతర అభివృద్ధి, వృత్తిలో ఉత్తమ ప్రతిభ కనబరచటం పట్ల డబ్ల్యూఏసీ నిబద్ధతను ఈ సదస్సు మరోసారి చాటిచెప్పింది.

# నిరుపేద కుటుంబానికి సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



ఆదిలాబాద్, సెప్టెంబర్ 17:నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు కడెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కన్నాపూర్ గ్రామానికి చెందిన బొంతల ఆశన్నకు రూ.27 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును కడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డు గంగన్న అందజేశారు.

ఈ సందర్భంగా గంగన్న మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు పడిగేల రాజు, బబ్లు, ప్రధాన కార్యదర్శి ముస్కు రాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముంజ ప్రసాద్ గౌడ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సలీం, టౌన్ అధ్యక్షుడు వాజీద్, ఏఎంసీ డైరెక్టర్ ఎల్. నారాయణ, పెద్దూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వషియొద్దీన్, నాయకులు రాము, వెంకటేష్, కిషోర్, బ్రహ్మచారి, నలేం శీను, ప్రశాంత్, బొంతల దాసు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ విధానాల నుంచి స్మార్ట్ మైనింగ్ వరకు

# కోల్ ఇండియా లిమిటెడ్ సాంకేతిక పరివర్తన

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17:భారతదేశ ఇంధన భద్రత, పారిశ్రామిక వృద్ధిలో బొగ్గు తవ్వకం ప్రధానాంశంగా ఉంది. సామర్థ్యాన్ని, భద్రతను, సుస్థిరతను పెంపొందించేందుకు భూగర్భ (యూజీ), ఓపెన్ కాస్ట్ (ఓసీ) కార్యకలాపాలు రెండింటినీ ఆధునికీకరించేలా సీఐఎల్ ఓ వ్యూహాత్మక మార్పును తీసుకువచ్చింది. సంప్రదాయ మైనింగ్ సాంకేతిక విధానాల నుంచి మరింత అధునాతన సాధనాలు, పద్ధతుల వైపు వేగంగా మారింది. ఐవోటీ, ఏఐ, డేటా ఎనలిటిక్స్ లాంటి అధునాతన డిజిటల్ విధానాలు... ప్రమాదాల ప్రభావాన్ని తగ్గిస్తున్నాయి. రికవరీ రేట్లను పెంచుతున్నాయి. అలాగే ముందస్తు నిర్వహణ, స్మార్ట్ కంట్రోల్ రూములు, ఆటోమేటెడ్ డిస్పాచ్, 'స్మార్ట్ మైన్స్' లాంటి వాటిని సాధ్యం చేస్తున్నాయి.

ఇన్సెసివ్ (కోర్ డ్రిల్లింగ్), నాన్ ఇన్సెసివ్ 2డీ/3డీ సీస్మిక్ సర్వే ద్వారా వనరులను గుర్తిస్తున్నారు. దీనివల్ల బోర్‌హోల్స్ సంఖ్య 50 శాతానికి తగ్గుతుంది. అలాగే స్పెక్ట్రల్ ఎన్‌హాన్స్‌మెంట్ (ఎస్‌ఈ) అస్సెయింగ్ ద్వారా వనరులను గుర్తించే సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. గామా రే, సాంద్రత, రెసిస్టివిటీ లాగ్‌ల ఆధారంగా బొగ్గు పొరలను విశ్లేషించడానికి మెషిన్ లెర్నింగ్ టెక్నిక్‌లను (ఎస్‌వీఎం, డెసిషన్ ట్రీ, ర్యాండమ్ ఫారెస్ట్, ఎంఎల్‌పీ, ఎక్స్‌జీబూస్ట్) ఉపయోగిస్తున్నారు. మైనింగ్‌కి ముందు, పూర్తయిన తర్వాత, ప్రతి దశలోనూ రిమోట్ సెన్సింగ్, జీఐఎస్, లైడార్, డ్రోన్లు, బాతిమెట్రిక్ సర్వేలను సీఎంపీడీఐ వినియోగిస్తోంది. గనుల పర్యవేక్షణ, పర్యావరణ మదింపు కోసం ఏఐ ఆధారిత శాటిలైట్ జియో స్పేషియల్ డ్యాష్ బోర్డును అభివృద్ధి చేసేందుకు ఎన్ఆర్ఎస్సీతో సీఐఎల్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

పేలుడు రహిత మైనింగ్ కోసం అధిక సామర్థ్యం కలిగిన హెచ్‌ఈఎంఎంలను 2021 నుంచి సీఐఎల్ క్రమంగా వినియోగంలోకి తీసుకువస్తోంది. వీటిలో 42 క్యూబిక్ మీటర్ల షవెల్స్, 240 టీఈ డంపర్లు, డ్రాగ్‌లైన్లు, సర్ఫేస్ మైనర్లు ఉన్నాయి. పేలుడు రహిత సాంకేతిక పరిజ్ఞానం దుమ్మును, శబ్దాన్ని, ప్రకంపనలను తగ్గిస్తుంది. అదే సమయంలో ఉత్పత్తి నాణ్యతను పెంచుతుంది. బొగ్గు వృథాను తగ్గిస్తుంది. 2024–25 లో ఎలక్ట్రిక్ డిటోనేటర్ల వాడకాన్ని దశల వారీగా నిలిపివేసి, అత్యంత సురక్షితమైన ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను ప్రవేశపెట్టారు. ఆపరేటర్ అలసటను గుర్తించడం, సమీప ప్రమాదాలపై హెచ్చరికలు ఇవ్వడం, 360 డిగ్రీల కెమెరాలు, స్వయంచాలితంగా అగ్ని ప్రమాదాలను గుర్తించడం/ అర్పడం లాంటి ఏఐ ఆధారిత భద్రతా ఫీచర్లు ప్రధాన హెచ్‌ఈఎంఎంల్లో ఏర్పాటయ్యాయి. వీటికి ఏఐ సిమ్యులేటర్లు, వీఆర్ ట్రైనింగ్ మద్దతు ఇస్తాయి. జీపీఎస్ ఆధారిత ట్రక్ డిస్పాచ్/ ఓఐటీడీఎస్, ఫ్లీట్ మానిటరింగ్ (ఎఫ్ఎంఎస్), వెహికల్ హెల్త్ మానిటరింగ్ (వీహెచ్ఎంఎస్) డిజిటలైజేషన్ ద్వారా వినియోగ సామర్థ్యం మరింత మెరుగవుతుంది.

కంటిన్యుయస్ మైనర్, లాంగ్ వాల్, హైవాల్ టెక్నాలజీలను ఉపయోగించి యూజీ ఉత్పత్తిని సుమారుగా 100 మిలియన్ టన్నులకు పెంచేందుకు సీఐఎల్ కట్టుబడి ఉంది. ఇప్పటికే కంటిన్యుయస్ మైనింగ్ విధానం అమలవుతోంది. ఇప్పుడు లాంగ్ వాల్ విధానం విస్తృత స్థాయిలో ప్రారంభమవుతుంది. మెరుగైన వెంటిలేషన్, స్ట్రాటా నిర్వహణ, భద్రతను బలోపేతం చేయడంతో పాటుగా పిల్లర్లలో నిక్షిప్తమై ఉన్న అధిక నాణ్యత కలిగిన బొగ్గును వెలికితీయడానికి పేస్ట్ ఫిల్ సాంకేతిక పరిజ్ఞానాల్లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

ఫస్ట్ మైల్ కనెక్టివిటీ (ఎఫ్ ఎంసీ), ముఖ్యమైన రైల్వే మౌలిక వసతుల ద్వారా బొగ్గు తరలింపును సీఐఎల్ బలోపేతం చేస్తోంది. సీహెచ్‌పీలు, సైలోలు, కన్వేయర్లు, ర్యాపిడ్ లోడింగ్ వ్యవస్థలను ఏకీకృతం చేసే 92 ప్రణాళికాబద్ధమైన ఎఫ్ఎంసీ ప్రాజెక్టుల్లో 46 ప్రాజెక్టులు కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఇవి సుమారుగా 432 ఎంపీటీఏ సామర్థ్యాన్ని సృష్టించాయి. దాదాపు రూ. 27,800 కోట్ల విలువైన ఈ కార్యక్రమం 2029–30 ఆర్థిక సంవత్సరం నాటికి 994 ఎంటీఏ యాంత్రిక లోడింగ్ సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. వీటికి తోడుగా, కీలకమైన ఏడు రైల్వే ప్రాజెక్టుల్లో (దాదాపు 23,465 కోట్లు) నాలుగు ప్రారంభమయ్యాయి. మిగిలిన వాటిని 2027'28 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గని లోపల రవాణా కోసం హెచ్ఈఎంఎం స్థానంలో హై-యాంగిల్/శాండ్‌విచ్ కన్వేయర్‌లను ఉపయోగిస్తున్నారు.

హెవీ మీడియా సైక్లోన్, హైడ్రో సైక్లోన్, టీటర్ బెడ్ సెపరేటర్, రిఫ్లక్స్ క్లాసిఫైయర్, జిగ్స్ వంటి ధాతు శుద్ధి సాంకేతికతలు సీఐఎల్ వాషరీలు అన్నింటిలోనూ పనిచేస్తున్నాయి.

రెండు ప్రధానాంశాలపై సీఐఎల్ డిజిటల్ వ్యవస్థ ఆధారపడి ఉంది. సమీకృత కమాండ్ కంట్రోల్ సెంటర్లు (ఐసీసీసీ) వాహన ట్రాకింగ్, ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థలు, వేబ్రిడ్జ్ ఆటోమేషన్, జీపీఎస్ వాహన పర్యవేక్షణ, ఏడు గనుల్లో డిజికోల్ పైలట్‌ను ఆపరేషనల్ టెక్నాలజీ (ఓటీ)లో సీఐఎల్ అమలు చేస్తోంది. ఎంటర్‌ప్రైజ్ ఐటీలో ఎస్ఏపీ ఎస్/4హెచ్ఏఎన్ఏ, ఈ-ఆఫీస్, ఎస్ఏం, క్లౌడ్ ఎనలిటిక్స్‌ను సీఐఎల్ అమలు చేసింది. వీటి ద్వారా కొనుగోళ్లు, నిల్వలు, ఆర్థిక వ్యవహారాలు, మానవ వనరుల ప్రక్రియలను సమగ్రం చేయడంతోపాటు, కాగిత రహిత ఫైల్ నిర్వహణకు మార్గం సుగమం చేసింది. అలాగే, వేగవంతమైన, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం మెరుగుపడింది.

తెలివైన, స్వతంత్రమైన, తక్కువ కర్బన ఉద్గారాలున్న మైనింగ్ దిశగా తర్వాతి దశ ముందుకు వెళుతోంది. 190 టన్నులకు పైగా సామర్థ్యం ఉన్న డీజిల్ ఎలక్ట్రిక్ డంపర్ల కోసం ఎలక్ట్రిక్ మొబిలిటీ, ట్రాలీ అసిస్ట్ సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెట్టేందుకు రిమోట్ ఆధారిత లైన్-ఆఫ్-సైట్ డోజర్లను (ఒక్కో యంత్రం ఖరీదు సుమారు రూ. 2 కోట్లు) ఎస్ఈసీఎల్, ఎన్సీఎల్ సంస్థల్లో పరీక్షిస్తున్నారు. శిలాజ ఇంధనాల ఆధారిత యంత్రాలను సురక్షితంగా విద్యుదీకరించేందుకు ఐఐటీ మద్రాస్‌తో కలిసి సీఐఎల్ పనిచేస్తోంది. సమాచార ప్రసారం, యాంత్రీకరణ, సిమ్యులేషన్ కోసం భూగర్భగనుల్లో 5జీ నెట్‌వర్కులు, డిజిటల్ ట్విన్స్, స్వయంచాలిత పర్యవేక్షణా రోవర్లను అభివృద్ధి చేస్తున్నారు.

రియల్-టైమ్ పర్యవేక్షణ, ముందస్తు నిర్వహణ, రిమోట్ కార్యకలాపాల కోసం 5జీ, ఐవోటీ, ఏఐ/ఎంఎల్, ఎడ్జ్ కంప్యూటింగ్, అధునాతన ఆటోమేషన్‌ను ఉపయోగించాలని సీఐఎల్ భావిస్తోంది. దీనిద్వారా గనులను క్రమంగా సాంకేతికతతో అనుసంధానించి, డేటా ఆధారిత ఆటోమేటెడ్ గనులుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. బొగ్గు అగ్ని ప్రమాదాలు, గనుల మూసివేత, అడవుల పెంపకం, ఆర్ అండ్ ఆర్ పనులను పర్యవేక్షించేందుకు ఎన్ఆర్ఎస్సీ సహకారంతో భువన్ జియోస్పేషియల్ డ్యాష్ బోర్డ్‌ను రూపొందిస్తోంది. సమాచార భద్రతా నిర్వహణను (ఐఎస్ఎంఎస్) మరింత పటిష్టం చేస్తూ, ఇప్పటికే 7 గనుల్లో పరీక్షించిన 17 డిజికోల్ పరిష్కారాలను అన్ని ప్రధాన గనులలో అమలు చేయనున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో హబ్-అండ్-స్పోక్ విధానంలో పనిచేసే నేషనల్ సెంటర్ ఫర్ కోల్ అండ్ ఎనర్జీ రీసెర్చ్ (ఎన్‌పీసీసీఈఆర్) ప్రాథమిక ప్రతిపాదనల దశ నుంచి ప్రోటోటైప్ అభివృద్ధి (టీఆర్ ఎల్-4, అంతకంటే ఎక్కువ) దిశగా దృష్టి సారించడంతో సీఐఎల్ పరిశోధనాభివృద్ధిలో వేగం పెరిగింది. మూడు ఎక్సలెన్సీ కేంద్రాలైన క్లీన్జ్ (ఐఐటీ హైదరాబాద్), సీఎస్ఈ (ఐఐటీ మద్రాస్), ఐమిన్ (ఐఐటీ-ఐఎస్ఎం ధనబాద్) 13 హై-టీఆర్ఎల్, 11 లో-టీఆర్ఎల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్నాయి. వీటిలో భూగర్భ కోల్ గ్యాసిఫికేషన్ (కస్తా, ఈసీఎల్), ఓసీ, యూజీ గనుల్లో 5జీ, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన పెరోవ్‌స్కైట్ సోలార్ సెల్స్ (ఐఐటీ, బాంబే సహకారంతో), ఎస్ఈసీఎల్ పరిధిలో చుర్చా యూజీ గనిలో ప్రయోగ దశలో ఉన్న 500 టన్నుల సెల్ఫ్ అడ్వాన్సింగ్ గోఫ్ ఎడ్జ్ సపోర్ట్స్ (ఎస్ఏజీఈఎస్) లాంటి కీలకమైన ప్రాజెక్టులు ఉన్నాయి. పైలట్ ఇంటిగ్రేటెడ్ కోల్ రిఫైనరీ కాంప్లెక్స్, శాశ్వత ఎన్‌పీసీసీఈఆర్ కేంద్రం ఏర్పాటు, హైడ్రోకైనెటిక్ పంప్డ్ స్టోరేజ్, కోటెడ్ స్ఫెరికల్ ప్యూరిఫైడ్ గ్రాఫైట్, డ్రై కోల్ బెనిఫిసియేషన్ విభాగాల్లో నూతన ప్రాజెక్టులు

భారీ మూలధన అవసరాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, విభిన్న భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా అంతర్జాతీయ సాంకేతికతలను స్వీకరించడం లాంటి సవాళ్లు భారత మైనింగ్ రంగంలో ఇంకా కొనసాగుతున్నాయి. సామర్థ్యాల పెంపు, అనుకూల విధానాల అండతో ఆటోమేషన్, రోబోటిక్స్, కృత్రిమ మేధ (ఏఐ), హరిత మైనింగ్ సాంకేతికతలను మరింత విస్తృతంగా అనుసంధానించడంలో సీఐఎల్ ప్రయాణం నిర్వచితమవుతుంది. తద్వారా సురక్షితమైన, సమర్థవంతమైన, సుస్థిరమైన మైనింగ్ వ్యవస్థ నిర్మాణంలో ఆవిష్కరణలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది.

# డీఆర్డీవో – పరిశ్రమల భాగస్వామ్య సదస్సు 'విమర్శ్'లో కీలక విధానపరమైన కార్యక్రమాలను వెల్లడించిన రక్షణ మంత్రి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17:న్యూఢిల్లీలో 2026 సెప్టెంబర్ 15న నిర్వహించిన 'విమర్శ్' (డీఆర్‌డీవో – పరిశ్రమల భాగస్వామ్య సదస్సు)లో పలు కీలక విధానపరమైన నిర్ణయాలను రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడించారు. ఎంఎస్ఎంఈలు, డీప్‌టెక్ అంకుర సంస్థలకు సాంకేతిక, ఆర్థిక అవరోధాలను తగ్గించడం కోసం.. ప్రత్యక్ష నిధులు, ప్రారంభ పూర్వ మద్దతు, డీఆర్‌డీవో పరీక్ష కేంద్రాలను వినియోగించుకునే వెసులుబాటుతో కూడిన సమగ్ర విధానాన్ని ప్రకటించారు. అలాగే సాఫ్ట్‌వేర్ ఆధారిత రక్షణ సామర్థ్యాలను వేగవంతం చేయడం, పాత సాంకేతికతల సమస్యలను పరిష్కరించడం కోసం.. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్ సోర్స్ కోడ్‌లను లైసెన్స్ పొందిన పరిశ్రమలతో పంచుకునేందుకు ఒక ప్రామాణిక, సురక్షిత విధానాన్ని కూడా ప్రారంభించారు.

అత్యాధునిక రక్షణ వ్యవస్థల వాణిజ్యపరమైన ఉత్పత్తికి మార్గం సుగమం చేసేలా.. సాంకేతిక పరిజ్ఞాన బదిలీ కోసం రూపొందించిన తొమ్మిది (9) లైసెన్సింగ్ ఒప్పందా (ఎల్‌ఏటీవోటీ)లను రక్షణ మంత్రి సమక్షంలో 13 తయారీ రంగ భాగస్వామ్య సంస్థలకు అందించారు.

పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడం, క్షేత్రస్థాయి భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా.. భారత రక్షణ రంగ తయారీ సంస్థల సొసైటీ (ఎస్ఐడీఎం), లఘు ఉద్యోగ్ భారతి సంస్థలతో వ్యూహాత్మక అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. అలాగే దేశీయ రక్షణ ఉత్పత్తుల నాణ్యత, తయారీ సామర్థ్యాన్ని అంచనా వేసి రేటింగ్ ఇచ్చే.. 'అధునాతన ఉత్పత్తుల అంచనా, రేటింగ్ వ్యవస్థ (సమర్) 2.0 వెర్షన్ కోసం క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో డీఆర్‌డీవో ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

రక్షణ మంత్రి మాట్లాడుతూ.. డీఆర్‌డీవో – పరిశ్రమల భాగస్వామ్యం ఉత్పత్తికి మాత్రమే పరిమితం కాకూడదన్నారు. పరిశోధన, రూపకల్పన, పరీక్షలు, ధృవీకరణ, తయారీ దశ వరకు... ప్రతి దశకూ ఈ భాగస్వామ్యాన్ని విస్తరించాలని స్పష్టం చేశారు. ప్రపంచ రక్షణ తయారీ కేంద్రంగా భారత్‌ను నిలపడమే లక్ష్యమని పునరుద్ఘాటించారు. "డీఆర్‌డీవో వద్ద విజ్ఞానం, సాంకేతికత ఉన్నాయి. పరిశ్రమలకు భారీ తయారీ సామర్థ్యముంది. అంకుర సంస్థలతో నూతన ఆవిష్కరణలు, ఉత్తేజం జనిస్తాయి. మన యువత నవ భారతాన్ని సృష్టిస్తోంది. ఈ నాలుగు శక్తులూ కలిసి ముందుకు సాగితే, అసాధ్యమైన లక్ష్యమంటూ ఏదీ లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఆర్థికంగా బలమైన దేశాన్ని నిర్మించడం మాత్రమే కాదు.. సాంకేతిక స్వయంసమృద్ధ, సామాజిక సమ్మిళిత, పర్యావరణ సుస్థిర, వ్యూహాత్మక భద్రత కలిగిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడమే 'వికసిత భారత్' లక్ష్యమని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. "2047 నాటికి కీలక సాంకేతికతల్లో మనం ఆత్మనిర్భరత సాధించాలి. స్వదేశీ పరికరాల వాటాను గణనీయంగా పెంచుకోవాలి. రక్షణ ఎగుమతుల్లో అనేక రెట్ల వృద్ధిని సాధించాలి. అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థల్లో భారత్ భాగస్వామ్యాన్ని బలంగా నెలకొల్పాలి'' అని ఆయన స్పష్టం చేశారు.

కొన్నేళ్లుగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో రక్షణ రంగంలో చేపట్టిన అపూర్వ సంస్కరణలను మంత్రి వివరించారు. దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించి, ఆత్మనిర్భరత దిశగా ముందడుగు వేసేలా.. దేశీయ తయారీదారుల నుంచే కొనుగోలు చేయాల్సిన రక్షణ పరికరాల జాబితాలను రూపొందించడం, మేక్ ఇన్ ఇండియా, ఐడెక్స్, అదితి పథకాలతోపాటు రక్షణ రంగ పరిశోధన అభివృద్ధి బడ్జెటులో 25 శాతాన్ని ప్రైవేటు రంగానికి కేటాయించడం వంటి విప్లవాత్మక నిర్ణయాలను ఆయన ప్రస్తావించారు. సాంకేతికత అభివృద్ధి నిధి ద్వారా అంకుర సంస్థలకు గ్రాంట్లను అందిస్తున్నామని, అనేక సాంకేతికతలు ఇప్పటికే ఉత్పత్తి దశకు చేరుకున్నాయని తెలిపారు. ఆర్మీ వాస్తవ కార్యాచరణ అవసరాల ఆధారంగా అంకుర సంస్థలు నూతన ఆవిష్కరణలు చేసేలా.. ఒక కొత్త వ్యవస్థను ఐడెక్స్ సృష్టించిందని ఆయన కొనియాడారు.

దేశ నూతన ఆవిష్కరణల పతాకధారులుగా అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలను రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. ప్రధాన రక్షణ వ్యవస్థలకు అవసరమైన కీలక భాగాలు, ఉపవ్యవస్థలు, అత్యాధునిక సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న ఈ సంస్థలదే 'ఆత్మనిర్భర భారత్' సాధనలో ప్రధాన పాత్ర అని వివరించారు. భారీ పరిశ్రమలతోపాటు ఎంఎస్ఎంఈలు, అంకుర సంస్థలను కూడా రక్షణ సరఫరా వ్యవస్థలో అంతర్భాగంగా అనుసంధానించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కొత్త విధానపరమైన నిర్ణయాలు పరిశ్రమలకు నూతన అవకాశాలను అందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కొత్తగా ప్రకటించిన విధానపరమైన నిర్ణయాలు.. పరిశ్రమల నేతృత్వంలో పరిశోధన- అభివృద్ధిని ప్రోత్సహించడంతోపాటు అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలకు ఆర్థిక సాయం, మార్గనిర్దేశం అందించడం, విద్యాసంస్థలు-పరిశ్రమల మధ్య భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై ప్రధానంగా దృష్టి సారించాయని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. అలాగే కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, డైరెక్టెడ్ ఎనర్జీ వంటి భవిష్యత్ సాంకేతికతల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రక్షణ రంగ దిగుమతిదారు స్థాయి నుంచి ఎగుమతిదారు స్థాయికి భారత్ వేగంగా చేరుకుంటోందని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. డ్రోన్ సాంకేతికత, కృత్రిమ మేధ, సైబర్ భద్రత వంటి పలు రంగాల్లో ఎంఎస్ఎంఈలు, అంకుర సంస్థలు వినూత్న ఆవిష్కరణలను వేగవంతం చేసి, దేశ సాంకేతిక, వ్యూహాత్మక సామర్థ్యాలను నూతన శిఖరాలకు చేర్చగలవని ఆయన అన్నారు. "దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఈలు వెన్నెముక. రక్షణ రంగానికి అత్యంత కీలకమైన బలం ఇవే. బడా కంపెనీలతో భాగస్వామ్యాలను విస్తరించుకుంటూనే.. నాణ్యత, తగిన సమయంలో సేవలందించడం, ఆవిష్కరణలు, అంతర్జాతీయ ప్రమాణాలపై ఎంఎస్ఎంఈలు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

సొంత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న దేశానికే తన భవిష్యత్తును స్వయంగా నిర్దేశించుకునే శక్తి ఉంటుందని రక్షణ మంత్రి వ్యాఖ్యానించారు. దేశ స్వభావంలో, ఆలోచనా వైఖరిలో 'ఆత్మనిర్భరత' అంతర్భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. "నేడు నూతన, ఆధునిక సాంకేతికతల్లో పెట్టుబడులు పెట్టే కంపెనీలే రేపటి రోజున అగ్రగాములుగా నిలుస్తాయి. సాంకేతికతలో ముందంజలో ఉన్న దేశమే భవిష్యత్ యుద్ధాల్లో వ్యూహాత్మక ఆధిక్యాన్ని సాధిస్తుంది'' అని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రక్షణ శాఖ కార్యదర్శి, డీఆర్‌డీవో చైర్మన్ శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ మాట్లాడారు. అత్యాధునిక వాణిజ్యపరమైన ఆవిష్కరణలతో దేశ రక్షణ రంగాన్ని సంసిద్ధం చేసేలా.. 'వార్తా సే వికాస్' అన్న ప్రధాన ఇతివృత్తంతో వ్యూహాత్మకంగా ఈ 'విమర్శ్ 2026' సదస్సును నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రక్షణ వ్యవస్థలో ప్రైవేట్ రంగ సామర్థ్యాలను క్రమబద్ధంగా జోడించడం దీని లక్ష్యమన్నారు. రక్షణ రంగాన్ని కేవలం కొనుగోలు దారు–అమ్మకందారు సంబంధంగా కాకుండా.. ఉమ్మడి భాగస్వామ్యంతో కూడిన సాంకేతిక వ్యవస్థగా నిలపడంలో ఈ వేదిక ఎంతగానో తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ స్వయంసమృద్ధి చర్యల ఫలితంగా గడిచిన కొన్నేళ్లలో రక్షణ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులను శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ వివరించారు. "సాంకేతిక పరిజ్ఞాన బదిలీల విస్తరణ ద్వారా సైనిక దళాల అవసరాలను తీర్చేందుకు సమాంతర ఉత్పత్తి మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. ఇది ఎంఎస్ఎంఈలకు నేరుగా లబ్ధి చేకూర్చడమే కాకుండా.. గతంలో పరిమితంగా ఉన్న ఉత్పాదక రంగానికి అడ్డంకిగా నిలిచిన పరిమితులను తొలగించడంలో సహాయపడింది. ఇప్పటివరకు 1,100కు పైగా పరిశ్రమలకు 2,300కు పైగా సాంకేతిక పరిజ్ఞాన బదిలీలు జరిగాయి. పరిశ్రమల భాగస్వామ్యాన్ని మరింత పెంచడం లక్ష్యంగా.. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన దాదాపు 50 క్షిపణి సంబంధిత సాంకేతికతలను ప్రస్తుతం పరిశ్రమలకు అందుబాటులో ఉంచాం" అని ఆయన తెలిపారు.

'డిఫెన్స్ సిస్టమ్స్ ఫర్ రెసిలియంట్ భారత్ – అడ్వాన్సింగ్ ఆత్మనిర్భరత ఇన్ డిఫెన్స్' అనే పుస్తకాన్ని కూడా ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. 2014 నుంచి 2026 వరకు డీఆర్‌డీవో టెక్నాలజీ క్లస్టర్లు రూపొందించిన ముఖ్యమైన రక్షణ వ్యవస్థల విశేషాలను ఇందులో క్రోడీకరించారు. దీనితోపాటు డీఆర్‌డీవోలో మానవ వనరుల అవుట్‌సోర్సింగ్ సేవా కాంట్రాక్టుల కోసం కొత్త మార్గదర్శకాలను విడుదల చేశారు. డీఆర్‌డీవో ప్రయోగశాల్లో మానవ వనరుల అవుట్‌సోర్సింగ్ ప్రక్రియ కోసం ఒక సమగ్రమైన విధానాన్ని ఈ మార్గదర్శకాలు అందిస్తున్నాయి. కొనుగోళ్లకు సంబంధించి నిర్దేశాలను రూపొందించడం, తగిన సంస్థల ఎంపిక, కాంట్రాక్టుల నిర్వహణ, పనితీరును పర్యవేక్షించడం, కాంట్రాక్టు నిబంధనలతోపాటు చట్టబద్ధమైన బాధ్యతలను నెరవేర్చడంలో ఇవి ఎంతగానో దోహదపడతాయి.

రక్షణ ఉత్పత్తి విభాగం కార్యదర్శి శ్రీ సంజీవ్ కుమార్, రక్షణ ఆర్థిక విభాగం కార్యదర్శి శ్రీ విశ్వజిత్ సహాయ్, డీఆర్డీవో విశిష్ట శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ (ఉత్పత్తి సమన్వయం, సేవల అంతర్గత అనుసంధానం) డాక్టర్ (శ్రీమతి) చంద్రికా కౌశిక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాంకేతిక సదస్సుల్లో భాగంగా.. వైమానిక వ్యవస్థలు, క్షిపణులు, ఆయుధ సామగ్రి, మైక్రోఎలక్ట్రానిక్స్, నౌకాదళ వ్యవస్థల్లో భవిష్యత్ సాంకేతిక ప్రణాళికలను డీఆర్‌డీవో టెక్నాలజీ క్లస్టర్ల డైరెక్టర్ జనరళు వివరించారు. నిబంధనల ప్రక్రియలను సులభతరం చేయడం, పరీక్ష కేంద్రాల కేటాయింపును వేగవంతం చేయడం, లైసెన్సింగ్ ప్రక్రియల కాల వ్యవధిని తగ్గించడం లక్ష్యంగా రూపొందించిన కొత్త కార్యక్రమాలను డీఆర్‌డీవో ప్రధాన కార్యాలయం ఆవిష్కరించింది.

ఉన్నత స్థాయి నిపుణుల బృంద చర్చలో.. డీఆర్‌డీవో, రక్షణ ఉత్పత్తి విభాగం (డీడీపీ), సాయుధ బలగాల సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా స్వీకరించడం, 'అభివృద్ధితోపాటే ఉత్పత్తి భాగస్వామ్య' విధానాలను మెరుగుపరచడం, దేశీయ సాంకేతికతలను త్వరితగతిన సైన్యంలోకి ప్రవేశపెట్టేందుకు అవసరమైన చర్యలపై వారు సమగ్రంగా చర్చించారు.

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి రక్షణ రంగ పరిశ్రమకు చెందిన 250 మందికి పైగా ప్రముఖులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ, సైనిక ఉన్నతాధికారులు, సీనియర్ డీఆర్డీవో శాస్త్రవేత్తలు హాజరయ్యారు. డీపీఐఐటీ కార్యదర్శి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.దేశీయ రక్షణ – పారిశ్రామిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన 'విమర్శ్ 2026' సదస్సు ఒక వ్యూహాత్మక వేదికగా నిలిచింది. డీఆర్‌డీఓ అభివృద్ధి చేస్తున్న సాంకేతిక పరిశోధనలను, అత్యాధునిక డీప్‌టెక్ అంకుర సంస్థలను, దేశంలోని బలమైన తయారీ వ్యవస్థను ఒకే తాటిపైకి తెచ్చింది. మరింత పారదర్శకమైన, వేగవంతమైన, విస్తృతమైన ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని అందించే వాతావరణాన్ని సృష్టించింది.

# ఆదిలాబాద్ అభివృద్ధికి ఎయిర్ పోర్ట్ ఓ మైలురాయి..

## ప్రజా పాలన దినోత్సవంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ..!



ఆదిలాబాద్, సెప్టెంబర్ 17: ఆదిలాబాద్ లో ఏర్పాటయ్యే విమానాశ్రయం ఉత్తర తెలంగాణలోనే మైలు రాయిగా నిలుస్తుందని, ఆదిలాబాద్ అభివృద్ధికి బాటలు వేసేలా ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ ప్రజా పరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని షబ్బీర్ అలీ జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని, ఇక్కడ ఏర్పాటు నిర్మాణానికి ప్రభుత్వం భూసేకరణ జీవో జారీ చేసిందన్నారు. జాయింట్ యూజర్ ఎయిర్ ఫీల్డ్ కోసం ప్రభుత్వం రూ. 2,278 కోట్లు కేటాయించి పరిపాలన ఆమోదం కూడా ఇచ్చిందని తెలిపారు. ఎయిర్పోర్ట్ నిర్మాణంలో భాగంగా 2009 ఎకరాల భూమి సేకరించి పనులు ప్రారంభిస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని షబ్బీర్ అలీ అన్నారు. అదేవిధంగా బోరజ్ మండలంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు.

2062 ఎకరాల భూ సేకరణ కూడా పూర్తయిందన్నారు. ఐటీ రంగం విస్తరణ ద్వారా చిన్న పరిశ్రమలు, భారీ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని షబ్బీర్ అలి వివరించారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా వినిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ క్రీడోత్సవాలకు ఎంపికైన 15 మంది అదిలాబాద్ జిల్లా హాకీ జట్టుకు రూ . 30 వేల నగదు పారితోషికం, హాకీ స్టిక్స్ కిట్ బ్యాగులు అందజేశారు.

జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్య, అదనపు కలెక్టర్లు ఆర్ఎస్ చిత్రు, ఎస్. రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సబ్ కలెక్టర్ ప్రణయ్, అదనపు ఎస్పీ మౌనిక, ఏఎస్పీ రిత్విక్ సాయి, డి.ఎన్.పి.ఎల్ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత ఈ సేవలో భాగం కావాలి..సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి

కరీంనగర్, సెప్టెంబర్ 17:సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించే స్వచ్ఛత ఈ సేవలో భాగం కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో స్వచ్ఛత ఈ సేవ పోస్టర్లను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత ఈ సేవలో ప్రజలంతా భాగం కావాలని కోరారు. స్వచ్ఛత కార్యక్రమాలలో పాలు పంచుకొని విజయవంతం చేయాలని వి జ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు సహకరించాలని మంత్రి అడ్లూరి కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రతో పాటు కరీంనగర్ డీఆర్డీఓ గీతా తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 17:(నేటినిజం ప్రతినిధి): : సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా పాలన సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్లలో ప్రజా పాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయం ఆవరణలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా జాతీయ జెండాను ప్రభుత్వ విప్ ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితే పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై వివరించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం ప్రజా ప్రభుత్వం ద్వారా జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కింద జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేర్చడం, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన పనుల ప్రణాళికలు రూపొందించడంలో ప్రజలను భాగస్వామ్యులు చేయడం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్ర స్థాయిలో విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యంగా జిల్లాలో మార్చి 6వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడం జరిగింది.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీకి ఇప్పటిదాకా 390 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. మూలవాగుపై ఉన్న బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు 47 కోట్ల 86 లక్షల రూపాయలతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు తుది దశకు చేరాయన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం..



కరీంనగర్, సెప్టెంబర్ 17: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీవో కార్యాలయంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి సిబ్బందికి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతం ప్రజాస్వామిక భారత సమాఖ్యలో అంతర్భాగమైన చారిత్రక సందర్భాన్ని స్మరించుకుంటూ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. ప్రజా సంక్షేమం, చట్టబద్ధ పాలన, శాంతిభద్రతల పరిరక్షణ పోలీసు వ్యవస్థ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. పౌరులకు సత్వర న్యాయం అందించేందుకు పారదర్శకమైన పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు, కమిషనరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైరాలో భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు..

## ఆర్యవైశ్యరాష్ట్రమహాసభ ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు



ఖమ్మం, సెప్టెంబర్ 17:వైరా పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కొలువుదీరిన మట్టి వినాయకుడి మండపం వద్ద గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు నిర్వహించిన మహా అన్నప్రసాద కార్యక్రమానికి దాతలు ముందుకొచ్చారు.

పబ్బతి సత్యనారాయణను స్మరించుకుంటూ ఆయన కుటుంబ సభ్యులు పబ్బతి ప్రవీణ్ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు సహకరించారు. వారి కుటుంబం అందించిన సహకారాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. మహా అన్నప్రసాద కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా వాసవి కళ్యాణ మండపం గౌరవ అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు, అధ్యక్షుడు డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి నూకల శ్రీనివాసరావు, కోశాధికారి మిట్టపల్లి వెంకటరమణ, మిట్టపల్లి కిరణ్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే సామాజిక వేడుకలుగా నిలుస్తున్నాయని తెలిపారు.

మండపంలో ప్రతిరోజూ భక్తులచే భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పురుషుల కౌంటర్లను రంగా సత్యనారాయణ, మిట్టపల్లి సత్యం, బాబు, నూకల ప్రసాదరావు, మిట్టపల్లి నాగేశ్వరరావు, పోలా శ్రీనివాసరావు, మిట్టపల్లి నర్సింహారావు, ఎంద్రపూడి శంకరరావు, కొల్లా రాంబాబు, కొణతాలపల్లి నగేష్, రంగ సింహాద్రి, కొదుమూరి రవి, మహిళల కౌంటర్లను ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మహిళా సభ్యులు నూకల అన్నపూర్ణ రంగా వాసవి, మిట్టపల్లి సుధ, సుగ్గల మాధవి, రాయపూడి రజని ప్రారంభించారు.

# ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లో తనిఖీలు

## అక్రమ లీజులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



ఖమ్మం, సెప్టెంబర్ 17: వైరా మున్సిపాలిటీలోని ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లో షాపుల నిర్వహణపై ఫిర్యాదులు రావడంతో మధిర ఆర్టీసీ డిపో మేనేజర్ దేవరాజ్ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. టెండర్ ద్వారా షాపులు పొందిన కొందరు వాటిని ఇతరులకు లీజుకు ఇచ్చి అధిక అద్దెలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఒకే రకమైన వ్యాపారాలు నిర్వహించడం, రోడ్లపై వ్యాపారాలు కొనసాగించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

ఈ నేపథ్యంలో డిపో మేనేజర్ దేవరాజ్ కాంప్లెక్స్‌లోని షాపులను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులకు జరిమానాలు విధించారు. నిబంధనలకు విరుద్ధంగా షాపులను ఇతరులకు లీజుకు ఇస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు.

# వినాయక నిమజ్జనంలో విషాదం..

అమరావతి, సెప్టెంబర్ 17:మండల పరిధిలోని ఎన్‌హెచ్-75 జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున విషాద ఘటన చోటుచేసుకుంది. గందోడిపాళ్యం గ్రామం నుంచి రాత్రి ఒంటిగంట సమయంలో వినాయక నిమజ్జనం కోసం చింతమాకుల చెరువుకు భక్తులు వెళ్తుండగా టోల్ ప్లాజా సమీపంలో ప్రమాదం జరిగింది. వి.కోట నుంచి నాయకనేరి వైపు బంగాళాదుంపల లోడుతో వెళ్తున్న టెంపో రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న భక్తులపై దూసుకెళ్లింది.

ఈ ప్రమాదంలో పైకనిన గ్రామానికి చెందిన వరలక్ష్మి (45), అదే గ్రామానికి చెందిన శివ (28) మృతి చెందారు. మరో ఇద్దరు వెన్నల, మరో వరలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కుప్పంలోని పీఈఎస్ మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రూ. 15.78 కోట్లకు పైగా నకిలీ ఐటీసీ మోసాన్ని వెలుగులోకి తెచ్చిన సీజీఎస్‌టీ ఢిల్లీ సౌత్ కమిషనరేట్ సంస్థ భాగస్వామి అరెస్టు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17:మోసపూరిత ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్‌లపై కొనసాగుతున్న తనిఖీల్లో భాగంగా, ఢిల్లీ సౌత్ కమిషనరేట్‌కు చెందిన కేంద్ర వస్తు, సేవల పన్ను (సీజీఎస్‌టీ) ఎగవేత నిరోధక విభాగం అధికారులు ఒక ఇనుము, ఉక్కు వ్యాపార సంస్థ భాగస్వామిని అరెస్టు చేశారు. సుమారు రూ. 87.67 కోట్ల విలువైన నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా రూ. 15.78 కోట్లకు పైగా అనర్హమైన ఐటీసీని మోసపూరితంగా పొందడం, వినియోగించడం, బదిలీ చేయడం లాంటి ఆరోపణలు ఈ కేసులో ఉన్నాయి.

పలు సంస్థలు జారీ చేసిన ఇన్‌వాయిస్‌ల ఆధారంగా అనర్హమైన ఐటీసీని పొందినట్లు గుర్తించారు. వాటిలో ఉనికిలో లేని, కార్యకలాపాలు నిర్వహించని, సస్పెండ్ అయిన, రద్దయిన సంస్థలు ఉన్నాయని దర్యాప్తులో తేలింది. అలాగే సరఫరాదారులు పేర్కొన్న వ్యాపార చిరునామాలో వాస్తవానికి ఎలాంటి కార్యకలాపాలు జరగడం లేదని క్షేత్రస్థాయి పరిశీలనలో నిర్ధారణ అయింది.

అనంతరం చేపట్టిన విచారణలో వస్తువులు తీసుకోకుండానే ఐటీసీని పొందినట్లు, వస్తువుల సరఫరా లేకుండానే జారీ చేసిన ఇన్‌వాయిస్‌ల ద్వారా ఆ మొత్తాన్ని పలువురు గ్రహీతలకు బదిలీ చేసినట్లు స్పష్టమైంది.

దర్యాప్తులో భాగంగా సేకరించిన సాక్ష్యాలు, సీజీఎస్‌టీ చట్టం-2017 లోని 70వ సెక్షన్ ప్రకారం నమోదు చేసిన వాంగ్మూలాల ఆధారంగా సీజీఎస్టీ చట్టం-2017లోని 69వ సెక్షన్ ప్రకారం 14.09.2026న నిందితుడిని అరెస్టు చేసి పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అతడికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

# అభాగ్యులకు బంధన్ సంస్థ అండ

ఖమ్మం, సెప్టెంబర్ 17: నిరుపేద ఒంటరి, వితంతు మహిళలకు ఐటీసీ స్వచ్ఛంద సంస్థ బంధన్ అండగా నిలుస్తోందని బూర్గంపాడు మండల ఏపీఎం హేమంత్ని అన్నారు. మొరంపల్లి బంజర్ గ్రామంలోని బంధన్ కార్యాలయంలో లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా ఆధారిత కుటుంబాలకు ఆర్థిక చేయూతనిస్తూ, స్వయం ఉపాధి ద్వారా తమ కాళ్లపై తాము నిలబడేలా సంస్థ ప్రోత్సహిస్తోందన్నారు. లబ్ధిదారుల అభిరుచులకు అనుగుణంగా ఫ్యాన్సీ షాపులు, కిరాణా దుకాణాలు, హోటళ్లు, బట్టలు, కూరగాయలు, పండ్ల వ్యాపారాలతో పాటు కుట్టుమిషన్లు అందించి, వాటిని మరింత అభివృద్ధి చేసుకునేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వ్యాపార నిర్వహణ, లాభాల పొదుపుపై అవగాహన కల్పిస్తున్న బంధన్ సంస్థ సేవలను ఆమె అభినందించారు.

# గిరిజనులకు స్వయంపాలన అందించిన కేసీఆర్

నల్గొండ, సెప్టెంబర్ 17: గ్రామాలకు దూరంగా అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించి గిరిజనులకు స్వయంపాలన అందించడంతో పాటు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ జడ్పీటీసీ జీడి బిక్షం అన్నారు. 2022 సెప్టెంబర్ 17న తండాలను గ్రామపంచాయతీలుగా చేసే చారిత్రక నిర్ణయాన్ని అమలు చేయడంతో పాటు గిరిజనుల రిజర్వేషన్‌ను పెంచిన కేసీఆర్ సేవలను గుర్తు చేసుకుంటూ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజానాయక్ తండాలో గిరిజనులు కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, జగదీష్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

మాజీ జడ్పీటీసీ జీడి బిక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి తండాలో కేసీఆర్ పేరు సువర్ణ అక్షరాలతో లిఖించబడిందన్నారు. గిరిజనుల రిజర్వేషన్‌ను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచి వారి జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. ఎంతోమంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేసీఆర్ ఏర్పాటు చేసిన గిరిజన గురుకులాలు కళ్లముందే కనిపిస్తున్నాయని అన్నారు. గిరిజనుల అభివృద్ధి, ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌కు చట్టబద్ధత కల్పించిన ఘనత కూడా కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు.

కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుతో గిరిజనులను మభ్యపెట్టి మోసం చేసిందని బిక్షం ఆరోపించారు.

# సెప్టెంబర్ 17కు చారిత్రక ప్రాధాన్యత..

## రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా కమిషనరేట్లో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



కరీంనగర్, సెప్టెంబర్ 17:: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం తెలంగాణ ప్రాంతం ప్రజాపాలనలోకి వచ్చిన సెప్టెంబర్ 17వ తేదీకి చారిత్రక ప్రాధాన్యత ఉందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, కమిషనరేట్ కార్యాలయ భవనం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతంతో పాటు రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను ఆలపించారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలందరికీ ఎంతో ప్రాముఖ్యత కలిగిన చారిత్రకదినమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం తెలంగాణ ప్రాంతం ప్రజాపాలనలోకి వచ్చిన సెప్టెంబర్ 17వ తేదీకి చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ఇదే రోజున అప్పటి నిజాంపాలన నుంచి తెలంగాణ ప్రాంతం భారత యూనియన్ లో విలీనమై, సమగ్ర భారతదేశంలో అంతర్భాగంగా మారిందన్నారు.

చారిత్రక పరిణామం కోసం నాడు ఎన్నో త్యాగాలు, బలిదానాలు చేసిన వారందరినీ గౌరవంగా స్మరించుకోవాలని తెలిపారు. వారి త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటూ దేశ సమగ్రత, ఐక్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ శాంతి, సౌభ్రాతృత్వం, అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేసేలా ప్రోత్సహించాలని సూచించారు. పోలీస్ శాఖ తరపున ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, వారికి భద్రత, సౌకర్యాలు కల్పించడం, శాంతిభద్రతలను మరింత పటిష్టంగా పరిరక్షించడం తమ ప్రధాన బాధ్యత అని పోలీస్ కమిషనర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, ఏవో శ్రీనివాస్, ఆర్ఐలు మల్లేశం, దామోదర్, రమేష్, గోదావరిఖని వన్టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్ రావు, రామగుండం సీఐ కృష్ణ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, వివిధ విభాగాల ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సీపీఓ సిబ్బంది, వివిధ విభాగాల సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, ప్రత్యేక బృందాల సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యక్తిగత (పీటూపీ) లావాదేవీల విషయంలో యూపీఐ చెల్లింపులు పూర్తిగా ఉచితం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17:కేంద్ర ప్రభుత్వం పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ (పీఎస్ఎస్) చట్టం- 2007కు సవరణలు చేసింది. దీనిద్వారా ఎటువంటి ఛార్జీలు వర్తించని నిర్దిష్ట డిజిటల్ చెల్లింపు విధానాలను నోటిఫై చేసే అధికారం ప్రభుత్వానికి లభించింది. ఈ సవరణ డిజిటల్ లావాదేవీలలో ఆర్థిక సౌలభ్యం, పారదర్శకతను నిర్ధారించడానికి చట్టపరమైన వెసులుబాటును కల్పిస్తుంది.

2026 సెప్టెంబర్ 14న కేంద్ర ప్రభుత్వం ఈ విధానం కింద ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీని ప్రకారం రూ. 2,000 వరకు ఉండే యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్) లావాదేవీలపై సున్నా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వర్తిస్తుందని స్పష్టం చేసింది.

కార్యాచరణ ప్రమాణాలు, ఫీజు పంపిణీ నమూనాలు, కేటగిరీ పరిమితులపై యూపీఐ స్టీరింగ్ కమిటీ చర్చించిన తర్వాత 2026 సెప్టెంబర్ 15న ఎన్‌పీసీఐ ఒక సమగ్ర సర్క్యులర్ కూడా జారీ చేసింది.

వ్యక్తిగత (పీటూపీ) లావాదేవీలకు లావాదేవీ విలువతో సంబంధం లేకుండా ఎటువంటి ఛార్జీలు ఉండవు. మొత్తం యూపీఐ లావాదేవీలలో పీటూపీ లావాదేవీలు పరిమాణం పరంగా 37 శాతం, విలువ పరంగా 70 శాతం ఉన్నాయి.

రూ.2000 కంటే ఎక్కువ ఉన్న పీటూఎం లావాదేవీలకు మాత్రమే ఛార్జీలు వర్తిస్తాయి.

రూ.2000 కంటే ఎక్కువ ఉన్న పీటూఎం లావాదేవీలపై నామమాత్రంగా 0.4 శాతం ఎండీఆర్ ఉంటుంది. ఈ కమిషన్‌ను బ్యాంకులు, యాప్ ప్రొవైడర్‌లతో సహా చెల్లింపు వ్యవస్థ భాగస్వాములు పంచుకుంటారు.

రూ.75000, అంతకంటే ఎక్కువ విలువైన అధిక-మొత్తం లావాదేవీలపై ఒక్కో లావాదేవీకి ఎండీఆర్ గరిష్ట పరిమితి రూ.300గా ఉంటుంది.

రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఇన్‌పుట్‌లు మొదలైన రంగాల విషయంలో రూ.2,000 కంటే ఎక్కువ లావాదేవీలకు రూ.5 చొప్పున ఒకే తరహా(ఫ్లాట్ రేట్) ఎండీఆర్ వర్తిస్తుంది.

ఈ ఒకటే రేటు నమూనా అత్యవసర ప్రజా సేవలు, తక్కువ లాభాల మార్జిన్ ఉన్న పరిశ్రమలలో ఖర్చుల విషయంలో స్థిరత్వాన్ని నిర్ధారిస్తుంది.

ఇలాంటి పారిశ్రామిక విభాగాలు మొత్తం యూపీఐ పీటూఎం లావాదేవీల పరిమాణంలో దాదాపు 17 శాతం, యూపీఐ మర్చంట్ లావాదేవీల విలువలో సుమారు 46 శాతం వాటాను కలిగి ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్లు, సెక్యూరిటీలు, స్టాక్ బ్రోకర్లు, డీలర్లకు చేసే చెల్లింపులపై నామమాత్రంగా 0.02 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. దీని గరిష్ట పరిమితి రూ.300. ఈ తగ్గిన రేటు వ్యవస్థీకృత ఆర్థిక మార్కెట్లలో రిటైల్ పెట్టుబడిదారుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది.పర్సన్-టూ-పర్సన్-మర్చంట్ (పీ2పీఎం) వర్గీకరణ కింద యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ. 1 లక్ష వరకు స్వీకరించే చిన్న వ్యాపారులు అన్ని లావాదేవీలపై తప్పనిసరి సున్నా ఎండీఆర్ సౌకర్యాన్ని కొనసాగిస్తారు.

ఇది అవ్యవస్థీకృత వీధి వ్యాపారులను వ్యవస్థీకృత ఖాతాలతో (మర్చంట్ అక్వైరింగ్ అకౌంట్) అనుసంధానిస్తుంది. ఇది అసంఘటిత రంగంలో డిజిటల్ స్వీకరణను ప్రోత్సహిస్తుంది.

ప్లాట్‌ఫామ్ ఫీజులు లేవు: యూపీఐ యాప్ ప్రొవైడర్లు ప్లాట్‌ఫామ్ ఫీజులను లేదా కనిపించని ఛార్జీలను వసూలు చేయకుండా స్పష్టంగా నిషేధం ఉంది.

యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ ఛార్జీలను వ్యాపారులు వినియోగదారుల నుంచి వసూలు చేయకుండా బ్యాంకులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అపరిమిత ఉచిత వినియోగం: వ్యక్తులకు ఉచిత యూపీఐ లావాదేవీలపై నెలవారీ కోటాలు, పరిమాణపరమైన పరిమితులు లేదా విభాగపరమైన పరిమితులు ఏవీ లేవు. భద్రతా పరిమితులు: బ్యాంకులు, ఎన్‌పీసీఐ ద్వారా అమలయ్యే రోజువారీ లావాదేవీల పరిమితులు (విభాగాన్ని బట్టి రూ.1-5 లక్షలు) పూర్తిగా రిస్క్ నిర్వహణ చర్యలే కానీ వాణిజ్య ఛార్జీల శ్రేణులు కావు.

అందుబాటులో ఉన్న డేటా ప్రకారం కేవలం 4 శాతం మర్చంట్ లావాదేవీలు మాత్రమే ఎండీఆర్ ప్రవేశపెట్టడం ద్వారా ప్రభావితమవుతాయి. ఎందుకంటే చాలా వరకు లావాదేవీలు రూ. 2,000 పరిమితి కంటే తక్కువగా ఉన్నాయి లేదా సున్నా ఎండీఆర్ పీటూపీఎం విధానం కింద ఉన్నాయి. ఇది సూక్ష్మ, చిన్న వ్యాపారాలపై ఖర్చుల భారం పడకుండా చూసుకుంటుంది.

చిన్న వ్యాపారుల విషయంలో యూపీఐ వినియోగాన్ని ప్రోత్సహించడానికి వసూలు చేసిన మొత్తం ఎండీఆర్‌లో 5 శాతంతో ఒక ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తారు. ఇది యూపీఐ వాడకాన్ని విస్తృతం చేయటంతో పాటు అది నిరంతరం కొనసాగేలా ప్రోత్సహిస్తుంది. ఇది భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో చిన్న వ్యాపారాల చేరికను వేగవంతం చేస్తుంది.

కొత్త ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్ యూపీఐని స్వయం సమృద్ధిగా మారుస్తుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మరింత విస్తరణకు ప్రోత్సాహకాలను అందిస్తుంది. అత్యధిక శాతం చెల్లింపులు ఎటువంటి ఛార్జీలు లేకుండా ఉచితంగా ఉండేలా చూస్తూనే పోటీతత్వం ఉండేలా చూసుకుంటుంది. ఫైనాన్స్‌పై స్టాండింగ్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా ఈ నిర్ణయం ఉంది. ఆ కమిటీ 32వ నివేదికలో ఈ కింది విధంగా సిఫారసు చేసింది:

'యూపీఐ వ్యవస్థ ఆర్థిక సుస్థిరతను సాధించేలా చూసేందుకు లాభదాయకమైన ఆదాయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం చాలా కీలకమని కమిటీ ప్రధానంగా సూచిస్తోంది.'

# యాదాద్రిని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదాం..

## -వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



నల్గొండ, సెప్టెంబర్ 17: అభివృద్ధి, సంక్షేమ రంగాలలో యాదాద్రి భువనగిరిని అగ్రగామిగా నిలుపుదామని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ' వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్‌తో కలిసి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

అనంతరం తెలంగాణ అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం 2025-26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ లో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా పతకాలు (మెడల్స్), ప్రశంసా పత్రాలు అందజేశారు.

ప్రజాపాలన దినోత్సవం అనంతరం, కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన 'విశ్వకర్మ జయంతి' వేడుకల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ భాస్కరరావు, జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి-రవికుమార్, వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల-వెంకటేశ్వర్లు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ చరిత్రలో మహోన్నత ఘట్టం.. ప్రజాపాలనకు మార్గదర్శకం

**ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.**

**ములుగులో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు.**

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.**




ములుగు, సెప్టెంబర్ 17:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 మహోన్నత ఘట్టమని, నాటి పోరాట స్ఫూర్తి ప్రజాపాలనకు మార్గదర్శకమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రాంగణంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలకు మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, సెప్టెంబర్ 17వ తేదీకి భారతదేశ, తెలంగాణ చరిత్రలో విశిష్టమైన స్థానం ఉందన్నారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, నాటి హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కాలేదని తెలిపారు. నిరంకుశ పాలనతోపాటు రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు వీరోచితంగా పోరాడారని గుర్తుచేశారు. రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థులు, యువత ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.

ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని చాటిన ఈ చారిత్రక సందర్భాన్ని ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు.

నాటి పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే వారికి అందించే నిజమైన నివాళి అని తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటికి తక్షణ పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్తు, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రైతుల సంక్షేమం, మహిళల ఆర్థికాభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, సాగునీటి సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు.

ములుగు జిల్లాలో మొదటి విడతలో 5,201 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 4,979 ఇండ్లకు మార్కింగ్ పూర్తి చేసి, 1,850 ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. రెండో విడతలో మరో 2 వేల ఇండ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గుడిసెలు లేని ములుగు జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిజమైన అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను కేటాయించనున్నట్లు తెలిపారు.

మహాలక్ష్మి పథకం ప్రారంభమైన నాటి నుంచి జిల్లాలో 2 కోట్ల 33 లక్షల 89 వేల 601 మంది మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా రూ.172 కోట్ల 6 లక్షలు ఆదా చేసుకున్నారని వివరించారు. మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబనకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

జిల్లాలో జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. ములుగు జిల్లా అభివృద్ధి ప్రస్థానంలో ఘట్టమ్మ వద్ద నిర్మించిన పైలాన్ ప్రాజెక్ట్ కలికితురాయిగా నిలిచిందన్నారు. నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం అందుబాటులోకి రావడంతో ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు ఒకేచోట సులభంగా లభిస్తున్నాయని తెలిపారు.

ఏజెన్సీ, మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక




కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని మంత్రి వెల్లడించారు. విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచడంతోపాటు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ స్ఫూర్తితో అధికారులు మరింత అంకితభావంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములై జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీ, రెవెన్యూ డిఅధికారి, జిల్లా రెవెన్యూ అధికారి, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రవిచందర్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు, వయోవృద్ధులు, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# వినాయక నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన



నిజామాబాద్, సెప్టెంబర్ 17: భీమ్‌గల్ పట్టణంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులు గురువారం పరిశీలించారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారులు నిమజ్జనం నిర్వహించే రాగన్నకట్ట, కప్పలవాగు ప్రాంతాలను సందర్శించి అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరె నాగమణి స్వామి, కమిషనర్ డి. గజానంద్ తెలిపారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం రూపొందించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నీలం రవి, ప్రజాప్రతినిధి జేజే నర్సయ్య, సర్వసమాజ్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పతాని కృష్ణ, రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, అశ్విని బాబు, ఎస్‌ఐ తిరుపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి

## పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నిజామాబాద్, సెప్టెంబర్ 17:డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతున్న హమారా ప్రసాద్‌పై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తాడ్వాయి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని అన్నారు.

గాంధీని గాడ్సే కాల్చి చంపినట్లే, అంబేద్కర్ ఇప్పుడు బతికి ఉంటే తానే కాల్చి చంపేవాడినని హమారా ప్రసాద్ వ్యాఖ్యానించారని నాయకులు పేర్కొన్నారు.

# 'ప్రత్యేక ప్రచారం 6' కోసం ఆన్‌లైన్ వేదికను ప్రారంభించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 17:'ప్రత్యేక ప్రచారం 6' పురోగతిని పర్యవేక్షించేందుకు రూపొందించిన ఆన్‌లైన్ వేదికను (హ్ట్ట్ప్స్://ప్ఘ్ఛ్.నిచ్.ఇన్/స్చ్ధ్ఙ్26) కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రారంభించనున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని మొత్తం 84 మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన 'ప్రత్యేక ప్రచారం 6' నోడల్ అధికారులు, ప్రజా ఫిర్యాదుల నోడల్ అధికారులు, అప్పీల్ అధికారులతో నిర్వహించే సమావేశంలో ఈ వేదికను ప్రారంభించనున్నారు. ఈ సమావేశంలో పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ (డీఏఆర్‌పీజీ) కార్యదర్శి, తపాలా శాఖ కార్యదర్శి, బొగ్గు శాఖ కార్యదర్శి, పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ (డీఎస్‌ఈఎల్) కార్యదర్శి, గనుల శాఖ కార్యదర్శి కూడా ప్రసంగించనున్నారు.

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతను సంస్థాగతం చేయడం, పెండింగ్‌లో ఉన్న పనులను తగ్గించడం కోసం ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రత్యేక ప్రచారాలను సమన్వయం చేసి, ముందుకు నడిపించే నోడల్ శాఖగా 2021 నుంచి పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ (డీఏఆర్‌పీజీ) వ్యవహరిస్తోంది. ప్రత్యేక ప్రచారం 6ను 2026 అక్టోబర్ 2 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు. దీనికి ముందు సన్నాహక దశను 2026 సెప్టెంబర్ 16 నుంచి 30 వరకు చేపడతారు. కేంద్ర ప్రభుత్వంలోని అన్ని కార్యాలయాల్లో పరిశుభ్రతను పూర్తిస్థాయిలో అమలు చేయడం ఈ ప్రత్యేక ప్రచారం లక్ష్యం.

2021 నుంచి 2025 వరకు నిర్వహించిన ప్రత్యేక ప్రచారాల అయిదు దశలతో పాటు, 2026 జూలై వరకు నిర్వహించిన నెలవారీ సచివాలయ సంస్కరణల పర్యవేక్షణ ద్వారా ఇప్పటి వరకు 24.20 లక్షలకు పైగా ప్రదేశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమాల ద్వారా 180.48 లక్షలకు పైగా ఫైళ్లను తొలగించారు లేదా వాటికి సంబంధించిన పనులను పూర్తిచేశారు. స్క్రాప్ (వ్యర్థ పదార్థాల) విక్రయం ద్వారా రూ.5,102.91 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ప్రత్యేక ప్రచారం 5లోనే దాదాపు 11.6 లక్షల ప్రదేశాలను పరిశీలించారు. 29.52 లక్షల ఫైళ్లను తొలగించారు. 233.75 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని ఖాళీ చేశారు. స్క్రాప్ విక్రయం ద్వారా సుమారు రూ.833.92 కోట్ల ఆదాయం పొందారు.

ప్రత్యేక ప్రచారాల సందర్భంగా అనేక వినూత్న కార్యక్రమాలను చేపట్టారు. డిసెంబర్‌లో నిర్వహించిన సుపరిపాలన వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను మూల్యాంకన నివేదికల రూపంలో రూపొందించి విడుదల చేశారు. ప్రత్యేక ప్రచారాలకు కేంద్ర మంత్రులు, సహాయ మంత్రులు, వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల కార్యదర్శులు నాయకత్వం వహించారు. ప్రత్యేక ప్రచారాల కార్యక్రమాలు, విజయాల గురించి ప్రధానమంత్రి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో కూడా ప్రస్తావించారు.

2026 ఆగస్టు 5న కేందర ప్రభుత్వంలోని అన్ని శాఖల కార్యదర్శులకు కేబినెట్ కార్యదర్శి డీఓ లేఖ రాశారు. అలాగే ప్రత్యేక ప్రచారం 6కు సంబంధించిన వివరణాత్మక మార్గదర్శకాలను డీఏఆర్‌పీజీ 2026 ఆగస్టు 13న జారీ చేసింది. ప్రత్యేక ప్రచారం 6ను అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలతో పాటు వాటి అనుబంధ, ఆధీన, స్వయంప్రతిపత్తి కార్యాలయాల్లో నిర్వహించనున్నారు. ప్రజలకు సేవలు అందించే లేదా ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగి ఉన్న క్షేత్రస్థాయి, ఇతర ప్రాంతాల్లోని కార్యాలయాలు, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు కూడా ఇందులో భాగస్వామ్యం కానున్నాయి. ఈ ప్రచారంలో పౌరులే కేంద్రంగా ఉండే విధానాలు, అందరినీ కలుపుకొని వెళ్లే చర్యలు వంటి ఉత్తమ పద్ధతులను మరింత విస్తృతంగా అమలు చేయడంపై దృష్టి సారించనున్నారు. ఈ-వ్యర్థాలను సమర్థవంతంగా సేకరించడం, వేరు చేయడం, తొలగించడం వంటి చర్యలకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

'ప్రత్యేక ప్రచారం 6' సన్నాహక దశ 2026 సెప్టెంబర్ 30 వరకు కొనసాగుతుంది. ఈ దశలో మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఎంపిక చేసిన విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తిస్తాయి. క్షేత్రస్థాయి సిబ్బందిని సమీకరించి, ప్రచారం నిర్వహించాల్సిన ప్రదేశాలను ఖరారు చేస్తాయి. రికార్డులను పరిశీలించడంతోపాటు కార్యాలయ స్థలాల సమర్థవంతమైన వినియోగానికి సంబంధించిన ప్రణాళికలను రూపొందిస్తాయి. గుర్తించిన స్క్రాప్ (వ్యర్థ పదార్థాలను) తొలగించే చర్యలను చేపడతాయి. ప్రత్యేక ప్రచారం 6లో అమలు చేసిన ఉత్తమ పద్ధతులను 2026 డిసెంబర్ 19 నుంచి 25 వరకు నిర్వహించే సుపరిపాలన వారోత్సవాల సందర్భంగా ప్రదర్శించనున్నారు.

# వరుణ ఎలివేటెడ్ కారిడార్: వారణాసిలో వారసత్వం, రవాణా, పురోగతి మధ్య సమతుల్యత

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17:శతాబ్దాలుగా వారణాసి భౌగోళిక, సాంస్కృతిక స్వరూపంలో వరుణ నది అంతర్భాగంగా ఉంటూ... నగర పేరులో సగభాగాన్ని ఇవ్వటంతో పాటు దాని అభివృద్ధికి తోడ్పడింది. నేడు ఈ నదీ తీర ప్రాంతం ఆధునిక పట్టణ రవాణాకు ప్రధాన కేంద్రంగా కొత్తరూపును సంతరించుకోనుంది.

రూ.10,998 కోట్ల అంచనా వ్యయంతో 43.218 కి.మీ. పొడవున నిర్మించనున్న వరుణ ఎలివేటెడ్ కారిడార్‌కు జూలైలో కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది వారణాసి భవిష్యత్ రవాణా వ్యవస్థలో కీలకంగా మారనుంది. వరుణ నది వెంబడి ఎన్‌హెచ్-31 నుంచి వారణాసి రింగు రోడ్డును కలిపే ఈ ప్రాజెక్టు, నగరంలో అత్యధిక సామర్థ్యం గల ప్రత్యామ్నాయ మార్గాన్ని అందించి, ప్రస్తుత పట్టణ రోడ్లపై ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తుంది.

రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రధానంగా 6, 4 లైన్ల ఎలివేటెడ్ కారిడార్‌ను అభివృద్ధి చేస్తుంది. ఇందులో ప్రధాన రహదారి, ఫ్లైఓవర్లు, లూప్‌లు, రాంప్‌లు, సర్వీస్ రోడ్లు ఉంటాయి. అదనంగా ఈ ప్రాజెక్టులో ఆకర్షణీయమైన కేబుల్స్ ఆధారిత వంతెన, ఎక్స్‌ట్రాడోస్డ్ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్-కమ్-మేజర్ బ్రిడ్జ్ ఉన్నాయి.

వారణాసి రద్దీ నివారణ ప్రణాళికలో ఈ కారిడార్ కీలకమైనది. ఇది ప్రధాన రహదారులు, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయం, ముఖ్యమైన పట్టణ ప్రాంతాల మధ్య రాకపోకలను మెరుగుపరిచేందుకు రూపొందించారు.

ఎన్‌హెచ్-31, వారణాసి రింగు రోడ్డును నేరుగా అనుసంధానించటం ద్వారా వారణాసి విమానాశ్రయం, వారణాసి కంటోన్మెంట్, వారణాసి సిటీ రైల్వేస్టేషన్, కాశీ రైల్వే స్టేషన్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్‌తో సహా కీలక రవాణా కేంద్రాలకు ప్రయాణ సౌకర్యాన్ని ఈ ప్రాజెక్టు మెరుగుపరుస్తుంది. రామ్‌నగర్ పోర్టుకు, వరుణ కారిడార్ వెంట ఉన్న ముఖ్యమైన ప్రాంతాలకు అనుసంధానాన్ని మరింత బలపరుస్తుంది.

మెరుగైన రహదారి వ్యవస్థ ద్వారా స్థానికులు, తీర్థ యాత్రలకు వెళ్లేవారు, పర్యాటకులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, ముఖ్యంగా రోజూ, సీజన్‌వారీగా భారీ రద్దీ ఉండే నగరంలో వేగవంతమైన, విశ్వసనీయమైన ప్రయాణాన్ని చేయగలుగుతారు.

గంటకు 80-100 కి.మీ వేగంతో ప్రయాణించేలా రూపొందించిన ఈ కారిడార్... ఎన్‌హెచ్-31, కాశీ రైల్వేస్టేషన్ మధ్య ప్రయాణ సమయాన్ని దాదాపు 40 నుంచి 20 నిమిషాలకు తగ్గిస్తుందని అంచనా. ఈ ప్రయాణ సమయం తగ్గటం వల్ల ట్రాఫిక్ సమస్యలుండవు. వాహన నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. ప్రయాణికులు, సరకు రవాణా సమర్థవంతంగా సాగుతాయి.

భారతదేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, విద్యా, పర్యాటక కేంద్రాల్లో వారణాసి ఒకటి. మెరుగైన రోడ్డు మౌలిక సదుపాయాలు... ఘాట్లు, కాశీ విశ్వనాథ్ కారిడార్, కాశీ విశ్వనాథ్ ఆలయంతో సహా ప్రధాన మతపరమైన, పర్యాటక ప్రాంతాలకు సులభమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తాయి.

ప్రధాన పండుగలు, రద్దీ సమయాల్లో నగరంలో సందర్శకుల తాకిడి విపరీతంగా పెరిగినప్పుడు అదనపు రోడ్డు సామర్థ్యం ట్రాఫిక్‌ను మరింత సమర్థవంతంగా క్రమబద్ధీకరించేందుకు, ప్రధాన నగర రహదారులపై ఒత్తిడిని తగ్గించేందుకు దోహదపడుతుందని ఆశిస్తున్నారు.

సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం వంటి ప్రధాన విద్యాసంస్థలకు కూడా ఈ ప్రాజెక్టు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పిస్తుంది. ఇది విద్యా కేంద్రాలు, నివాస ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని బలపరుస్తూ... విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు రోజువారీ ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తుంది.

వారణాసిని ప్రధాన ప్రాంతీయ రవాణా, ఆర్థిక కేంద్రంగా ఈ కారిడార్ మరింత బలపరుస్తుందని అంచనా. పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా చందౌలి సామాజిక-ఆర్థిక మండలం, చందౌలి సామాజిక నోడ్, ఆరు ప్రధాన రవాణా కేంద్రాలకు ఇది మెరుగైన సౌకర్యాన్ని అందిస్తుంది.

జాతీయ రహదారులు, రైల్వే మౌలిక సదుపాయాలు, సరకు రవాణా కారిడార్ల మెరుగైన అనుసంధానం వల్ల... వారణాసి, చందౌలి, చుట్టుపక్కల ప్రాంతాల మధ్య వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామిక వస్తువులు, నిర్మాణ సామాగ్రి, ఖనిజాల రవాణా మరింత సులభమవుతుంది.

ప్రాంతీయ లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని మెరుగుపరచటం ద్వారా, రవాణా అడ్డంకులను తగ్గించటం ద్వారా, ఆర్థిక కార్యకలాపాలకు ఈ ప్రాజెక్టు ఊతమిస్తుంది. ప్రాంతీయ పోటీతత్వాన్ని పెంచుతుంది. తూర్పు ఉత్తరప్రదేశ్‌లో కొత్త అభివృద్ధి అవకాశాలకు మార్గం సుగమం చేస్తుంది.

అధిక జనసాంద్రత, చారిత్రక ప్రాధాన్యత గల పట్టణ ప్రాంతంలో ఇప్పటికే ఉన్న నివాసాల మధ్య రోడ్లను పెద్దఎత్తున విస్తరించాల్సిన అవసరం లేకుండా రవాణా సామర్థ్యాన్ని పెంచటానికి వరుణ కారిడార్ అవకాశాన్నిస్తుంది.

వ్యూహాత్మకంగా ప్లాన్ చేసిన లూప్‌లు, రాంప్‌లు ,సర్వీస్ రోడ్ల మద్దతుతో కూడిన ఎలివేటెడ్ అలైన్‌మెంట్, దూరప్రాంత, ప్రాంతీయ ట్రాఫిక్ కోసం ప్రత్యేక రవాణా మార్గాన్ని అందిస్తుంది. స్థానిక ట్రాఫిక్ నుంచి సుదూర రాకపోకలను వేరు చేసేందుకు, నగరంలోని అత్యంత రద్దీ రోడ్లపై ఒత్తిడిని తగ్గించేందుకు ఇది దోహదపడుతుంది.

ఈ ప్రాజెక్టులో సివిల్ నిర్మాణ పనుల కోసం రూ. 4,565.33 కోట్లు, భూసేకరణకు రూ. 934.91 కోట్లను కేటాయించారు. నగరవ్యాప్తంగా నిరంతరంగా ఉండే అధిక-సామర్థ్య కారిడార్ నిర్మాణానికి, దీని రూపకల్పనలో ప్రధాన వంతెనలు, అనుసంధాన నిర్మాణాలను మిళితం చేశారు.

వారణాసి జంక్షన్, ఫుల్వారియా, చౌకాఘాట్ వంటి ప్రధాన రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ఈ కారిడార్ ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ పరిమిత రహదారి సామర్థ్యం వల్ల స్థానిక, వాణిజ్య, ఇతర వాహనాల రద్దీతో ట్రాఫిక్ ఏర్పడుతోంది.

వారణాసి జంక్షన్ నుంచి లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం మధ్య ప్రయాణాన్ని ఇది గణనీయంగా మెరుగుపరుస్తుందని అంచనా. ఈ మార్గంలో ప్రయాణ సమయం దాదాపు గంట నుంచి 20 నిమిషాలకు తగ్గనుంది.

వారసత్వం, పుణ్యక్షేత్రం, విద్య, వాణిజ్యం, పర్యాటకం కలగలిసిన ఒక నగరానికి వరుణ ఎలివేటెడ్ కారిడార్ కేవలం ఒక నూతన రహదారి ప్రాజెక్టు మాత్రమే కాదు.. చారిత్రక, వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలోని ప్రత్యేకమైన సవాళ్లను ఎదుర్కొంటూ, రవాణా సామర్థ్యాన్ని పెంచేందుకు చేస్తున్న ఒక ప్రయత్నం.

సాంస్కృతిక, పర్యాటక, రవాణా, ఆర్థిక కేంద్రంగా వారణాసి విస్తరిస్తున్న తరుణంలో ఈ వరుణ కారిడార్... ఆధునిక రవాణాకు ప్రధాన మార్గంగా నిలవనుంది. ఇది ప్రజలను, ప్రాంతాలను, ఆర్థిక కార్య కలాపాలను అనుసంధానిస్తూ... నగరం మరింత సమర్థవంతంగా ముందుకెళ్లేందుకు సహకరిస్తుంది.

# చేయూత పెన్షన్ దరఖాస్తుల ఇంటింటి పరిశీలన



నిజామాబాద్, సెప్టెంబర్ 17:: ముప్కాల్ మండలంలోని నల్లూరు గ్రామంలో చేయూత పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను అధికారులు ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. పెన్షన్ స్పెషల్ ఆఫీసర్, ఆర్‌డబ్ల్యూఎస్ సాజియా అఫ్రిన్ దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలను పరిశీలించి, అర్హతకు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియను ఎంపీడీఓ రమేష్ తనిఖీ చేసి, పెన్షన్ దరఖాస్తుదారులను కలిసి వారి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా నమోదు చేయాలని అధికారులు సూచించారు.

ఈ కార్యక్రమంలో నల్లూరు సర్పంచ్ బర్కం గంగాధర్, ముప్కాల్ మండల వార్డు మెంబర్ల ఫోరం ఇన్‌చార్జి అక్క పత్రి ప్రవీణ్ కుమార్, జీపీ కార్యదర్శి విఘ్నేష్, ఎఫ్ఏ భూమేష్, కారోబార్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు, సుస్థిర భవిష్యత్తుకు వెదురే మార్గం

సెప్టెంబర్ 18...ప్రపంచ వెదురు దినోత్సవం




పపంచ వెదురు దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18న ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటారు. ఈ రోజును వెదురు ప్రాముఖ్యతను తెలియ జేయడం, దాని వినియోగాన్ని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణలో దాని పాత్రను గుర్తు చేయడం ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేశారు. 2009లో థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన ఎనిమిదవ ప్రపంచ వెదురు కాంగ్రెస్ సందర్భంగా ప్రపంచ వెదురు సంస్థ దీనిని అధికారికంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రపంచ దేశాలు, ముఖ్యంగా ఆసియా దేశాలు, ఈ దినోత్సవాన్ని విశేషంగా పాటిస్తున్నాయి. వెదురు ఒక గడ్డి జాతికి చెందినప్పటికీ చెట్లంత ఎత్తుగా పెరిగి మానవ జీవన విధానంలో కీలక పాత్ర పోషిస్తున్నది. దీనిని అద్భుత మొక్క అని, పేదల ఉక్కు అని పిలవడం దాని బహుముఖ వినియోగాల వలన. రోజుకు కొన్ని అడుగుల వరకు పెరిగే వేగవంతమైన పెరుగుదలతో పాటు ఇతర చెట్ల కంటే ఎక్కువ ఆక్సిజన్ విడుదల చేస్తూ వాయు మండలంలో ఉన్న కార్బన్ డయాక్సైడ్‌ను అధికంగా గ్రహించడం ద్వారా పర్యావరణ సమ తుల్యతకు విశేష సహాయం చేస్తుంది. భూసారాన్ని కాపాడడం, వరదల ప్రభావాన్ని తగ్గించడం, నేలలో తేమ నిల్వ ఉంచడం వంటి ప్రకృతి సంరక్షణలో కూడా వెదురు ఒక అద్భుతమైన సహజ వనరుగా నిలుస్తుంది.

ప్రపంచ వ్యాప్తంగా వెదురుకు 1200కుపైగా జాతులు ఉన్నాయి. వాటిలో సుమారు 136 జాతులు భారతదేశం లోనే లభ్యమవు తున్నాయి. అసోం, త్రిపుర, మణిపూర్, మేఘాలయ, అరుణాచల్ వంటి ఈశాన్య రాష్ట్రాలు వెదురు సమృద్ధిగా పెరిగే ప్రాంతాలుగా గుర్తింపు పొందాయి. నేషనల్ బాంబూ మిషన్ నివేదిక ప్రకారం భారత దేశంలో సుమారు 13.96 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో వెదురు పెరుగుతోంది. ఈ విస్తీర్ణంలో సగం కన్నా ఎక్కువ భాగం ఈశాన్య రాష్ట్రాల్లోనే ఉంది. భారతదేశ వెదురు ఉత్పత్తి ప్రపంచ ఉత్పత్తిలో దాదాపు 45 శాతం ఉండటం విశేషం. గ్రామీణ జీవన విధానంలో వెదురు ఒక అవిభాజ్య భాగంగా నిలుస్తూ ఇళ్ల నిర్మాణం, చిన్న వంతెనలు, నీటి కాల్వలు, మేడలు, బావులు, గోడల కట్టడాలు అన్నీ వెదురుతోనే సాధ్యమవు తున్నాయి. లక్షలాది మంది వడ్రంగులు, బుట్టల కార్మికులు, పూలమాలలు చేసే వృత్తిదారులు, పతంగి తయారీ దారులు, నూలు వృత్తి నిపుణులు, వాయిద్య కారులు ఉపాధి కోసం వెదురు పైనే ఆధారపడి ఉన్నారు.

కాగితం పరిశ్రమలో వెదురు ముడి సరుకుగా ఉపయోగ పడుతుండగా, ఆధునిక కాలంలో ఫర్నిచర్, అంతర్గత అలంకరణ వస్తువులు, ఫ్లోరింగ్, బట్టలు, వంట పాత్రలు, టూత్ బ్రష్‌లు, బొమ్మలు, సంగీత వాయిద్య పరికరాలు వంటి ఎన్నో వస్తువులు కూడా వెదురు తోనే తయారవు తున్నాయి. అంతేకాక వెదురు మొగ్గలు ఆసియా దేశాల్లో ఆహారంగా వినియోగించ బడుతూ పోషక విలువలతో కూడిన ప్రత్యేకమైన పదార్థంగా గుర్తింపు పొందాయి.

వెదురు పర్యావరణ పరిరక్షణలో అపూర్వ సహాయం చేస్తుంది. భూమి తాపాన్ని తగ్గించడం, గాలి నాణ్యతను మెరుగు పరచడం, వాతావరణ మార్పుల దుష్ప్రభా వాలను నియంత్రించడం వంటి అనేక విధాలుగా తోడ్పడుతుంది.

మూడేళ్ల లోనే పూర్తిగా ఎదిగే వెదురు వేగవంతమైన పచ్చదన విస్తరణకు కారణ మవుతుంది. ఈ కారణంగానే పర్యావరణ శాస్త్రవేత్తలు వాతావరణ సంక్షోభానికి వెదురును సమర్థవంతమైన పరిష్కారంగా సూచిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, చిన్నతరహా పరిశ్రమల విస్తరణలో కూడా వెదురు ఒక కీలక వనరుగా మారింది. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ సంఘాలు వెదురుతో మరిన్ని పర్యావరణ అనుకూల ఉత్పత్తులు తయారు చేయడానికి, పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నాయి.

మొత్తం మీద వెదురు మానవ జీవన విధానం, పర్యావరణ సమతుల్యత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి అన్నీ కలిపిన జీవనాధారమని చెప్పవచ్చు.

యుగాలుగా మానవుడి జీవితంలో భాగమైన ఈ ఆకుపచ్చ బంగారాన్ని సంరక్షించడం, విస్తరించడం మన అందరి బాధ్యత. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18న జరుపుకునే ప్రపంచ వెదురు దినోత్సవం ఈ బాధ్యతను మనకు గుర్తుచేస్తూ పచ్చదనానికి, భవిష్యత్తు తరాల భద్రతకు మనం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిస్తోంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## బద్ధిపల్లిలో అసంపూర్తి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలి



**వేలాది పేద కుటుంబాలకు అద్దె ఇండ్ల నుంచి విముక్తి కల్పించాలి**
**రాష్ట్ర బీసీ సంక్షేమం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఎంఐఎం నేతల వినతి**
**స్పందించిన పొన్నం ప్రభాకర్ పెండింగ్ ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ**

కరీంనగర్, సెప్టెంబర్ 17: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ జిల్లా కొత్తపల్లి హావేలి మండలం బద్దిపల్లి గ్రామంలో 2004 నుంచి 2014 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేయించి, వినియోగంలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని నిధులు విడుదల చేయాలని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు సయ్యద్ ఇబ్రహీం, మాజిద్ హుస్సేన్, రాష్ట్ర బీసీ సంక్షేమం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కొత్తపల్లి మండలము బద్దిపల్లి గ్రామంలో 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో.. కరీంనగర్ పట్టణానికి చెందిన అన్ని వర్గాల పేద ప్రజలకు సొంత ఇంటి కలను సాకారం చేసి, వారి దారిద్ర్యాన్ని దూరం చేయాలనే దృఢ సంకల్పంతో ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సుమారు 4000మంది పేద ప్రజలను ఎంపిక చేసి, వారికి నివేశన స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసింది. ఇందిరమ్మ బిల్లులను దఫా దఫాలుగా ఇండ్ల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఇందులో సుమారు 50శాతం ఇండ్లు పూర్తయ్యాయి. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రంలో ప్రభుత్వం మారాక, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు నిధుల మంజూరును నిలిపోయివేయడంతో, ఈ4వేల ఇండ్లలో సుమారు యాభై శాతం ఇందిరమ్మ ఇండ్లు కొన్ని 80శాతం, ఇంకొన్ని 50శాతం అసంపూర్తి దశలో మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఈఅసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయించడానికి ఈపేద కుటుంబాలకు బాసటగా నిలిచేందుకు జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారుల చేత క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి అసంపూర్తి లో ఉన్న ఇండ్ల నిర్మాణాలను సర్వే చేయించి, ఈ ఇండ్ల నిర్మాణాలకు సరిపడా నిధులను మంజూరు చేయించి పెండింగ్లో ఉన్న ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయించి వాటిని పేద ప్రజలకు అందే విధంగా వినియోగం లోకి తీసుకొచ్చి అన్ని వర్గాల పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంఐఎం నేతల విజ్ఞప్తికి స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఇందిరమ్మ పెండింగ్ ఎండ్ల నిర్మాణానికి నిధులను సమకూర్చేలా తన శాయశక్తుల కృషి చేస్తానని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్లు సయ్యద్ ఇబ్రహీం, మాజీద్ హుస్సేన్ నాయకులు ఎంఏ సలీం, యూసుఫోద్దీన్ బాబు భాయి, తయ్యబ్, తౌసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నగర మేయర్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



కరీంనగర్, సెప్టెంబర్ 17: (నేటినిజం ప్రతినిధి) దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను గురువారం రోజున కరీంనగర్ లో మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘనంగా , అత్యంత వైభవంగా, సేవా దృక్పథంతో నిర్వహించారు. ప్రధాని మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుతూ, ప్రధాని మోదీ దేశానికి అందిస్తున్న సేవలు మరింత కాలం కొనసాగాలని, ఆయనకు దైవబలం తోడుండాలని ఆకాంక్షిస్తూ స్థానిక ప్రతిష్టాత్మక మహిమాన్విత దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. ప్రధాని దీర్ఘాయువును కాంక్షిస్తూ వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా ఆయుష హోమం ,గణపతి హోమం లను ప్రత్యేక అర్చనలు అభిషేకాలను మేయర్ కొలగాని శ్రీనివాస్ జరిపించి అమ్మవారి ఆశీస్సులు కోరారు.కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా సమాజ సేవే లక్ష్యంగా పలు కార్యక్రమాలను మేయర్ కొలగాని శ్రీనివాస్ చేపట్టారు. నగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి వారి ఆశీర్వాదాలను తీసుకున్నారు. రేపటి బావి భారత పౌరులైన చిన్నారులలో ఉత్సాహాన్ని నింపుతూ, వారి చదువుకు ప్రోత్సాహకరంగా నోట్ బుక్స్ పెన్నులను పంపిణీ చేశారు అనంతరం. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశాన్ని విశ్వవేదికపై నిలబెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం దేశ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రజాసేవ కోసమే ప్రధాని మోడీ జీ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం కొనసాగిందన్నారు. ప్రధాని మోదీ రాజకీయ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రధాని మోదీ నిండు నూరేళు ఆయురారోగ్యాలతో జీవించడానికి ప్రజలందరూ భగవంతుని ప్రార్థించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ బండ రమణారెడ్డి, కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, , కొంపల్లి శ్వేత రమన్, సోమిడి వేణు ప్రసాద్, ఏపీపీ చంద్ర, ఎన్నం లక్ష్మి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ పురపాలక సంఘంలో వైభవంగా 'ప్రజా పాలన దినోత్సవం'

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 17:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో గురువారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా అధికారికంగా నిర్వహిస్తుండటం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. 1948 సెప్టెంబర్ 17న నిజాం రాచరికపు బంధనాల నుంచి తెలంగాణ స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న ఘట్టం ప్రతీ తెలంగాణ బిడ్డకు గర్వకారణం అని తెలిపారు. నాటి విమోచన పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను నేడు సముచిత రీతిలో స్మరించుకుంటున్నాం అన్నారు. ?ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడి పాలన అందించడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తోంది అన్నారు. గతంలో సరైన గుర్తింపు పొందని ఈ చారిత్రాత్మక దినానికి నేడు అధికారిక స్థాయిలో పండుగ వాతావరణం కల్పించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందన్నారు. ప్రజాస్వామ్య ఫలాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయి వరకు ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే లక్ష్యంతో 'ప్రజా పాలన' సాగుతోందని అదే బాటలో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు, మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు మున్సిపాలిటీ నిరంతరం శ్రమిస్తోందన్నారు. స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం

**-ఘనంగా నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు**



నేటి నిజం రాజన్న సిరిసిల్ల ప్రతినిధి తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో ముందుగా తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా పాత ఆంధ్ర బ్యాంక్ సర్కిల్లో జాతీయ జెండా ఎగరవేసి జాతీయ గీతాలపన గావించారు అనంతరం నరేంద్ర మోడీ గారి పుట్టినరోజు సందర్భంగా భీమేశ్వర ఆలయంలో కోడిమొక్కులు ప్రత్యేక పూజలు నిర్వహించి కృష్ణవేణి టాలెంట్ స్కూల్, హంసిని స్కూల్ విద్యార్థులతో తో కేక్ కటింగ్ చేసిన అనంతరం మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షకుడు ప్రపంచ దేశాల్లో భారత దేశ ఔన్నత్యాన్ని అత్యున్నత స్థాయిలో నిలుపుతున్న మోడీ పుట్టినరోజు సందర్భంగా కి రాజన్న భీమన్న ఆశీస్సులు ఉండాలని కోరుకున్నామని తెలిపారు. బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు చెప్పినట్లు ధర్మం పెడతోవ పడుతున్న ప్రతీ సందర్భంలో ఏ యుగంలో కానీ తాను ఉద్భవిస్తానని చెప్పిన మాటల ప్రకారం మోడీ ఈ యుగపురుషుడిగా మేము భావిస్తున్నామని అన్నారు. ప్రధానమంత్రి కి ఆయురారోగ్యాలతో భారతదేశాన్ని కీర్తి కిరీటంలో ఉంచేలా రాజన్న భీమన్న ఆశీస్సులు ఉండాలని కోరారు. తెలంగాణ విమోచన దినోత్సవం రెండు పార్టీలు కూడా కాంగ్రెస్ టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజల్ని మోసం చేస్తున్నారని రానున్న రెండు ఏళ్లలో ప్రజలు బిజెపికి పట్టణ కట్టడం ఖాయం తెలంగాణ ప్రజల ఆకాంక్షల్ని తప్పకుండా బిజెపి ఆధ్వర్యంలో నెరవేరుస్తామని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులూ కౌన్సిలర్ కుమ్మరి శంకర్ ముత్యం కొండ్లెపు వంగల శ్రీనివాస్ మైలారం శ్రీనివాస్ రాష్ట్ర బఙ మోర్చా కార్యదర్శి సంటి మహేష్ లీగల్ సెల్ నాయకులు రేగుల రాజ్ కుమార్ కోల కృష్ణస్వామి సనీటి అంజిబాబు రేగుల మల్లికార్జున్ పిన్నింటి హనుమాన్లు రేగుల శ్రీకాంత్ మామిళ్ళ లక్ష్మీరాజ్యం వివేక్ రెడ్డి కటకం శ్రీనివాస్ నామాల శేఖర్ గుడిసె మనోజ్ బిల్లా కృష్ణ నామాల శేఖర్ సగ్గు రాహుల్ చిక్కుడు మల్లేశం మహంకాళి శ్రీనివాస్ యస్వంత్ హరీష్ సాయి కృష్ణ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## వేములవాడ గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 17:(నేటి నిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జన వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బూర ఉమా రమేష్ గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు భజన కీర్తనలు పాడుతూ, డప్పు చప్పుళ్లకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థులు చేసిన 'జై గణేశా' నామస్మరణలతో పాఠశాల ప్రాంగణమంతా మార్మోగి, పండుగ కోలాహలం నెలకొంది. పాఠశాల నుంచి ప్రారంభమైన శోభాయాత్ర అనంతరం స్థానిక జలాశయంలో వినాయకుడిని శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. "గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్ళీ త్వరగా రావయ్యా" అంటూ విద్యార్థులు లంబోదరుడిని వేడుకున్నారు.

## ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ



ములుగు, సెప్టెంబర్ 17:(నేటినిజం ప్రతినిధి): ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగు మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా గౌరవ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఆసియా షాహిన్ గారు జాతీయ జెండాను ఆవిష్కరించడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రజా పాలన యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ములుగు మున్సిపాలిటీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆహ్వానం

శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం సౌజన్యంతో
ఎం.వి.ఆర్ ఫౌండేషన్ నిర్వహణలో
రచన సాహిత్య వేదిక, కడప మరియు
గడియారం వారి కుటుంబీకుల సంయుక్త ఆధ్వర్యంలో
'మహాకవి' డా॥ గడియారం వేంకట శేషశాస్త్రి

**45వ సాహిత్య పురస్కార ప్రదాన సభ**



డా॥ గడియారం వేంకట శేషశాస్త్రి
పురస్కార స్వీకర్త
ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు

తేదీ:20.09.2026, ఆదివారం
సమయం:సాయంత్రం 05-30 గంటలకు

వేదిక:శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం
సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్

మట్టిగుంట వెంకటరమణ
ఎం.వి.ఆర్. ఫౌండేషన్
సెల్: 8374822255

డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి
కార్యదర్శి, రచన సాహిత్య వేదిక
సెల్: 9966624276

స్వాగతం:
శ్రీ గడియారం వేంకట శేషశర్మ
ఉపాధ్యక్షులు, రచన సాహిత్య వేదిక, ప్రొద్దుటూరు

సభాధ్యక్షులు:
శ్రీ విహారి, రచన సాహిత్య వేదిక, అధ్యక్షులు

ప్రత్యేకాహ్వానితులు : రచన సాహిత్య వేదిక గౌరవ సలహామండలి సభ్యులు
డా॥ రేవూరి అనంత పద్మనాభరావు గారు
పూర్వ అదనపు డైరెక్టర్ జనరల్, దూరదర్శన్, ఢిల్లీ
శ్రీ గుత్తికొండ సుబ్బారావు గారు
అధ్యక్షులు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం, మచిలీపట్నం

పురస్కార స్వీకర్త :
'సారస్వత భాస్కర' ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు
విశ్వ విఖ్యాత శాస్త్రవేత్త, విద్వత్కవి, 'పంచవటి' కావ్యకర్త

విశిష్ట అతిథులు:
ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారు
పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
డా॥ వెల్చాల మురళీధరరావు గారు
సుప్రసిద్ధ విమర్శకులు, బహుభాషా విద్వాంసులు, 'విద్యారత్న', ఢిల్లీ
శ్రీ సుధామ గారు
సుప్రసిద్ధ జాతీయ కవి, సాహితీవేత్త, 'సప్తపది' సృజనకర్త, హైదరాబాద్
శ్రీమతి ధూళిపాళ అరుణ గారు
సుప్రసిద్ధ సాహితీ విదుషీమణి, హైదరాబాద్

ప్రశంసాపత్ర ప్రదానం : శ్రీ యం. జానకిరామ్, ఉపాధ్యక్షులు

డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి,కార్యదర్శి శ్రీ అన్నవరం రామకుమార్, కార్యవర్గసభ్యులు

కార్యక్రమ సమన్వయం :
రచన సాహిత్య వేదిక కార్యవర్గ సభ్యులు : ఎన్. సుధీర్‌రెడ్డి, ఎన్.సురేష్ కుమార్, యస్.ఆర్.ప్రతాపరెడ్డి, డా॥ మూలె రామమునిరెడ్డి, యం. రమేష్, ముడియం కిషోర్ కుమార్.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.